తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక

# జనంసాక్షి

www.janamsakshi.org

## వరంగల్ - ఆదిలాబాద్

హన్మకొండ | జనగాం | ములుగు  నిర్మల్ | మంచిర్యాల
ప్రొ॥ జయశంకర్ భూపాలపల్లి  కొమురం భీం ఆసిఫాబాద్
మహబూబాబాద్

సోమవారం
21 సెప్టెంబర్ 2026 | పేజీలు - 20



# టీనేజీ ప్రేమలు కన్నవారి కన్నీళ్లు

- స్మార్ట్‌ఫోన్ల మాయలో పడుతున్న యువత
- క్షణికావేశంలో బలవుతున్న నిండు ప్రాణాలు
- కుటుంబాల్లో మిగులుతున్న గుండెకోత

**మారుతున్న కాలంతో పాటు టెక్నాలజీ, స్మార్ట్‌ఫోన్ల వాడకం విపరీతంగా పెరిగిపోయింది. దీనివల్ల తెలియని ప్రాయంలోనే టీనేజ్ వయసు పిల్లలు ఆకర్షణలు, ప్రేమల మాయలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. క్షణికావేశంలో వారు తీసుకుంటున్న నిర్ణయాలు కన్నవారి కళ్లల్లో కన్నీళ్లు, గుండెల్లో నిరంతర ఆవేదనను మిగులుస్తున్నాయి. మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా ఇటీవల చోటుచేసుకుంటున్న కొన్ని తీవ్రమైన ఘటనలు సమాజాన్ని తీవ్రంగా ఆలోచింపజేస్తున్నాయి.**

తాండూర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి) :

మంచిర్యాల జిల్లా పరిధిలోని లక్షెట్టిపేట, దండేపల్లి, జైపూర్, మందమర్రి, బెల్లంపల్లి వంటి ప్రాంతాలలో ఇటీవలి కాలంలో వరుసగా చోటుచేసుకున్న లవ్ ట్రాజెడీలు తీవ్ర కలకలం రేపాయి.క్షణం తట్టుకోలేక బలవన్మరణాలు: ప్రేమించిన వారు దూరం కావడం లేదా ఇంట్లో పెద్దలు పెళ్లికి నిరాకరించారనే కారణంతో పట్టుమని ఇరవై ఏళ్లు కూడా నిండని యువతీ యువకులు తీవ్ర నిర్ణయాలు తీసుకుంటున్నారు.తాండూర్ మండలంలో ఒకరు ఉరి వేసుకొని బలవన్మరణానికి పాల్పడగా, ప్రాణాలు తీసుకున్న ఘటన స్థానికులను తీవ్రంగా కలచివేసింది.



సోషల్ మీడియా పరిచయాలు, ప్రేమ పేరిట యువతులను వంచించడం, ఆ తర్వాత వారి వ్యక్తిగత సమాచారంతో బ్లాక్‌మెయిలింగ్ లేదా వేధింపులకు గురిచేయడంతో మనస్తాపానికి గురై యువతులు ఇంట్లోనే ఆత్మహత్యలకు పాల్పడుతున్న ఉదంతాలు జిల్లాలో రోజురోజుకూ పెరుగుతున్నాయి. కన్నవారి గుండెకోత.. అనాథలవుతున్న కుటుంబాలు రెక్కల కష్టాన్ని నమ్ముకుని, రాత్రింబవళ్లు శ్రమించి పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్న తల్లిదండ్రులకు ఈ వార్తలు కోలుకోలేని దెబ్బ తీస్తున్నాయి. సమాజంలో పరువు పోతుందనే ఆందోళన ఒకవైపు, చేతికొచ్చిన కొడుకో కూతురో ప్రాణాలు విడిచారనే ఆవేదన మరోవైపు వారిని బతికుండగానే నరకయాతనకు గురిచేస్తున్నాయి. ఎన్నో ఆశలు పెట్టుకున్న కన్నవారికి కన్నీళ్లే మిగులుతున్నాయి.

### మార్పు ఎక్కడ రావాలి?

ఈ సున్నితమైన సమస్యకు కేవలం ఆవేశం పరిష్కారం కాదని నిపుణులు మరియు జిల్లా పోలీసులు చెప్తున్నారు. పిల్లల ప్రవర్తనలో మార్పులను గమనిస్తూ తల్లిదండ్రులు స్నేహితుల్లా మారాలని, వారి స్మార్ట్‌ఫోన్ల వాడకంపై నిఘా ఉంచాలని సూచిస్తున్నారు. విద్యాసంస్థల్లో షీ టీమ్స్ ద్వారా మరిన్ని అవగాహన సదస్సులు నిర్వహించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జిల్లా ప్రజలు కోరుతున్నారు.



# తడిసిన నేల... మురిసిన అన్నదాత

- నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో పంటలు కళకళ



కెరమెరి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి) : కెరమెరి మండలంలో గత నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో యాసంగి పంటలకు జీవం వచ్చింది. ఆకాశం వైపు చూస్తున్న అన్నదాతల ముఖాల్లో ఆనందం వెల్లివిరిసింది. మండలంలో మొత్తం 8,213 మంది రైతులు 29,950 ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేశారు. అందులో ప్రధానంగా పత్తి 26,200 ఎకరాలు, కంది 2,800 ఎకరాలు, మొక్కజొన్న 800 ఎకరాలు, కూరగాయలు 100 ఎకరాలు, పెసర 80 ఎకరాల్లో సాగు చేశారు. వర్షాలు లేక వాడిపోతున్న పంటలు తాజా వర్షాలతో ఏపుగా పెరుగుతున్నాయి. రైతులు తెగులు మందులు పిచికారీ చేస్తున్నారు. మండలంలోని పలు ప్రాంతాల్లో కూరగాయల సాగు కూడా ఊపందుకుంది.

**పంటలు ఏపుగా పెరుగుతున్నాయి : రాథోడ్ ఉత్తం, (పత్తి రైతు) బోరిలాల్గూడ**

వారంలో ఒకటి రెండు సార్లు వర్షాలు పడుతుండటంతో పంటలు ఏపుగా పెరుగుతున్నాయి. పత్తి, కంది సాగు చేశాను. ఏలినో ప్రభావంతో వర్షాలు రావని, అతి తక్కువ దిగుబడి వస్తుందని అనుకున్నా, ఇప్పుడు వర్షాలతో పంటలు బాగున్నాయి.



# గణేశ్ విగ్రహాల కనువిందు

- రోడ్డుకు ఇరువైపులా 14 విగ్రహాల ప్రతిష్ఠాపన.. దర్శనానికి తరలివస్తున్న భక్తులు



లక్ష్మణచందా, సెప్టెంబర్ 20, (జనం సాక్షి): మండల కేంద్రంలోని శివాజీ విగ్రహం నుంచి గాంధీ విగ్రహం వరకు ప్రధాన రహదారికి ఇరువైపులా ఏకంగా 14 గణేశ్ విగ్రహాలను ప్రతిష్ఠించారు. గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆకృతులు, అలంకరణలతో ఏర్పాటు చేసిన విగ్రహాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. ప్రధాన రహదారిపై వరుసగా గణేశ్ విగ్రహాలు దర్శనమివ్వడంతో ఆ ప్రాంతం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. విగ్రహాలను దర్శించుకునేందుకు లక్ష్మణచందా మండలంతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివస్తున్నారు. సాయంత్రం వేళల్లో భక్తుల రాకతో ప్రధాన రహదారి సందడిగా మారుతోంది. గణేశ్ మండపాల వద్ద నిర్వాహకులు ప్రత్యేక పూజలు, భజనలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

# ఓపెన్ కాస్ట్ హఠావో- రామప్ప బచావో!

- వెంకటాపూర్ ఓపెన్ కాస్ట్ పై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- ప్రజాభిప్రాయ సేకరణను అడ్డుకునేందుకు ప్రయత్నాలు



వార్త మెయిన్ 7లో

# తెలంగాణ ఉద్యమకారులను ఆదుకోవాలి

- ఉద్యమకారుల ఓదార్పుతో వారి జీవిత స్థితిగతులు తెలుస్తున్నాయి
- తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్



**వరంగల్ బ్యూరో, సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** తెలంగాణ రాష్ట్రం కోసం పోరాటం చేసిన తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక చైర్మన్ గుడిమల్ల రవికుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన విలేకరుల సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గత మూడు రోజులుగా తొలి దశ మలిదశ ఉద్యమకారుల కోసం ఓదార్పు యాత్ర జరుగుతుందని ఈ ఓదార్పు యాత్ర వల్ల ఆనాటి ఉద్యమకారుల స్థితిగతులు స్పష్టంగా అర్థం అవుతున్నాయని అన్నారు. తొలి రోజు 25 మందిని సన్మానం చేశామని ఇప్పటివరకు 75 మందిని సన్మానం చేసినట్లు తెలిపారు. తెలంగాణ వచ్చినందుకు సంతోషం లేదని ఉద్యమకారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు రవికుమార్ వివరించారు. అందరూ బాధలో ఉన్నారని ఎలాంటి సంక్షేమ ఫలాలు అందక ఆవేదన పడుతున్నట్లు తెలిపారు. గత 12 ఏళ్లలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని అన్నారు. తెలంగాణ ఉద్యమం కోసం 1200 మంది తమ ఆత్మ బలిదానాలు చేసుకున్నారని చెప్పారు. వారి త్యాగం గొప్పది అన్నారు. తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం అధికారులు పట్టించుకోవాలని ఈ సందర్భంగా రవికుమార్ కోరారు. లేదంటే మరో ఉద్యమం కోసం అడుగులు వేయాల్సి వస్తుందని తెలిపారు. ఉద్యమకారులందరినీ ఐక్యం చేసి వారిలో ఆత్మస్థైర్యాన్ని నింపడమే కాకుండా వారికి రావలసినటువంటి ఫలాలు అందే వరకు తాము పోరాటం చేస్తామని గుడిమల్ల రవికుమార్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు చాంద్ పాషా, బొలిశెట్టి అశోక్, నారాయణరెడ్డి, రాజమౌళి, కుమారస్వామి, నెల్సన్, కేడల ప్రసాద్, నటరాజ్, రమేష్, రవీందర్, ఇమ్రాన్, స్వర్ణలత, శ్యామ్, స్వామి యాదవ్, మాధవి లత, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఓరుగల్లు కోట సందర్శించిన వరంగల్ సిపి శ్వేత




**ఖిలా వరంగల్, సెప్టెంబర్20(జనం సాక్షి)** చారిత్రక ప్రసిద్ధి చెందిన ఓరుగల్లు కోటలోని శిల్ప సౌందర్యాన్ని వీక్షించడానికి ఆదివారం వరంగల్ సిపి శ్వేత మరియు వారి కుటుంబ సభ్యులు విచ్చేయగా వారికి పర్యాటక శాఖ గైడ్ దేనబోయిన రవి యాదవ్ వారికి స్వయంభు ఆలయంలోని ఒక్కొక్క శిల్ప సౌందర్యం చూపించుకుంటూ వాటి చరిత్రను వివరించి వారిని ముగ్ధుల్ని చేశాడు. ప్రత్యేకంగా కళాతోరణం ఎంతో అద్భుతంగా ఉందని ముగ్గురు మనుషులు నాలుగు కాళ్ల విగ్రహాన్ని చూసి నాటి శిల్పులను వారి గొప్పతనాన్ని నాటి వారసత్వ సంపదలను నేటితనం కాపాడుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని కమిషనర్ ఆఫ్ పోలీస్ సి పి శ్వేతా అన్నారు, ఏకశిలా కొండ, కుష్మహల్, శృంగార బావి అక్కాచెల్లెళ్ల బావులు రాతికోట మెట్లు శంభు లింగేశ్వర స్వామి ఆలయంలోని శత్రుముఖ లింగం వాటి వీక్షించి ఎంతో అద్భుతంగా ఉన్నాయని కొనియాడారు. వారి వెంట పురావస్తు కోఆర్డినేటర్ శ్రీకాంత్ పోలీస్ అధికారులు వారి వెంట ఉన్నారు.

# ఎల్కతుర్తి తెలంగాణ అంబేద్కర్ సంఘం అధ్యక్షునిగా బొంకూరి రాజు



**ఎల్క్ తుర్తి సెప్టెంబర్ 20 జనం సాక్షి** ఆదివారం రోజున రాష్ట్ర అధ్యక్షులు వెల్మకంటి దయాకర్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి కాకతీయ వనవిహార్ పార్క్‌లో తెలంగాణ అంబేద్కర్ సమావేశం నిర్వహించి అనంతర ఎల్కతుర్తి మండల కమిటీ నూతన అధ్యక్షుని గా ఇందిరానగర్ గ్రామానికి చెందిన బొంకూరి రాజును ఏకగ్రీవంగా నియమించడం జరిగింది. ఉపాధ్యక్షులు దామెర గ్రామానికి చెందిన గొర్రె తిరుపతి, ఎల్కతుర్తి గ్రామానికి చెందిన అంబాల కిరణ్ , ప్రధాన కార్యదర్శిగా పెంచికలపేట్ గ్రామానికి చెందిన బొల్లారపు శ్రీనివాస్, సహాయ కార్యదర్శులుగా చిలుముల ప్రమోద్,గొర్రె అజయ్ ఆరేపల్లి కిరణ్, సలహాదారులుగా ఎ ల్తూరి సురేష్, సంఘం గౌరవ అధ్యక్షుడిగా ఆరేపల్లి రాజయ్యలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు సంఘ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు రాజు మాట్లాడుతూ, నాపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చెయ్యకుండా అంబేద్కర్ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లి యువతను చైతన్య పరిచి, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ కోసం నిరంతరం కృషి చేయాలని అన్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నిక కాబడిన బొంకూరి రాజు మాట్లాడుతూ, నాపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన, జిల్లా నాయకులకు, సంఘం సభ్యులకు పేరుపేరునా కృతజ్ఞతలు తెలిపారు. నేటి నుంచి అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా మండలంలోని అన్ని గ్రామాలలో కమిటీలు వేసి సంఘం బలోపేతానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు అంబాల ఆర్య రాజ్ మండల కమిటీ సభ్యులు, అంబేద్కర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తాడిచర్లలో పాము కాటుతో రైతు మృతి



**మల్హర్,సెప్టెంబర్20(జనంసాక్షి)** మండల కేంద్రమైన తాడిచర్ల గ్రామంలో పాముకాటుతో రైతు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు కందుల మల్లయ్య (52) తన వ్యవసాయ పనులు చేసుకుంటున్నా సమయంలో పాము కాటు వేయడం తో రైతు మృతిచెందాడు.పాము కాటు వేసిన వెంటనే స్థానిక రైతులు సమీప ఆరోగ్య కేంద్రముకు తీసుకెళ్లగా పరిస్థితి విషమంగా ఉందని తెలపడంతో కుటుంబ సభ్యులు జిల్లా ప్రధాన ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ పరిస్థితి విషమించడంతో హన్మకొండ లోని ప్రైవేట్ హాస్పిటల్ తీసుకెళ్లగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతునికి భార్య ఒక కొడుకు, కూతురు ఉన్నారు.రైతు కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం చేసి ఆదుకోవాలి అని తాడిచర్ల గ్రామ సర్పంచ్ బండి స్వామి పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ పోచంపల్లి స్వగ్రామంలో బీఆర్ఎస్‌కు బిగ్ షాక్

### కాంగ్రెస్‌లో చేరిన వరికోల్ గ్రామ బీఆర్ఎస్ నాయకులు



**హనుమకొండ సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** :హనుమకొండ భవానీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం యందు నడికూడ మండలం వరికోల్ గ్రామానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ నాయకులు పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు . అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా కాంగ్రెస్ పార్టీలో చేరుతున్నారని తెలిపారు. ప్రజల్లో కాంగ్రెస్ ప్రభుత్వంపై విశ్వాసం క్రమంగా పెరుగుతోందని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలకు ప్రజల నుంచి స్పందన లభిస్తోందని అన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు అభివృద్ధి పేరుతో దోచుకున్నారని, ధనిక రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ పాలన సాగిస్తోందని తెలిపారువరికోల్ గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో బిఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరడం పట్ల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. పార్టీలో చేరిన ప్రతి ఒక్కరికీ సముచిత గౌరవం, ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నడికుడ మండల పార్టీ అధ్యక్షులు మల్లారెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబానికి పరామర్శ

### నివాళులర్పించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన రమేష్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 20 (జనం సాక్షి):** మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్, చెన్నారావుపేట సొసైటీ చైర్మన్ భూక్య గోపాల్ నాయక్‌లు పరామర్శించారు.మండలంలోని శంకరం తండా గ్రామానికి చెందిన భూక్య హనుమ నాయక్ తండ్రి గ్రామ సర్పంచ్ లావణ్య మామ భూక్య మంగ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు.విషయాన్ని తెలుసుకున్న వారు స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి వెళ్లి మృతదేహంపై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం హనుమ కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. వారి వెంట అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు భూక్య మహబూబ్ సింగ్ రాథోడ్, సొసైటీ డైరెక్టర్ మంద యాకయ్య గౌడ్, సర్పంచ్ లు దార రంజిత్, బానోతు విక్రమ్, భూక్య బుజ్జి సురేష్, భూక్య ఉమా మోహన్ నాయక్, జాటోతు పత్ని రవి నాయక్, యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షులు, ఉప సర్పంచ్ ల ఫోరం అధ్యక్షులు బండి హరీష్, మాజీ సర్పంచ్ భూక్య బద్రు నాయక్, స్వామి నాయక్, సొసైటీ డైరెక్టర్ రఘు నాయక్, గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు వట్టె తిరుపతిరెడ్డి, శోభన్, రవి నాయక్, రాములు నాయక్, సూర్య నాయక్, రవి, రమేష్, బద్రు, రాజు, వీరు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అహ్మదియా ముస్లిం స్త్రీల జిల్లా వార్షిక సమావేశాలు



**ఆత్మకూరు, సెప్టెంబర్ 20, (జనం సాక్షి):** ఆదివారం అంతర్జాతీయ అహ్మదీయా ముస్లిం మహిళల బాలికల మిశ్రమ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా వార్షిక సమావేశాలు ఆత్మకూరు మండలము హౌజుబుజుర్గు గ్రామములో నిర్వహించారు. ఈ సమావేశాలకు జిల్లాలోని పలు గ్రామాలనుండి జమాఅత్ మహిళలు బాలికలు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉదయం 10 గంటలకు జిల్లా జమాఅత్ మహిళల సమితి అధ్యక్షురాలు ఆయిష అధ్యక్షతన ప్రారంభమై ఈసమావేశాలు సాయంత్రం 6 వరకు కొనసాగాయి . ఈ సమావేశాలలో స్త్రీల బాలికలకు విద్య,ఆధ్యాత్మిక, ధార్మిక పరమైన పోటీల కార్యక్రమాలు నిర్వహించారు . అదేవిధంగా స్త్రీలలో ఉత్సాహాన్ని నింపే ఆటల పోటిలను కూడా నిర్వహించారు. ఇజ్తెమ ముగింపు కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు మహిళల నుద్దేశించి ఇలా అన్నారు. అల్లాతల ఈ సృష్టి లో స్త్రీలకు ప్రత్యేకమైన స్థానాన్ని ప్రసాదించాడు. మన ప్రియతమా ఖలీఫా హజ్రత్ మిర్జా మస్రూర్ అహ్మద్ కుర్ ఆన్ జగత్ ప్రవక్త హజ్రత్ ముహమ్మద్ ముస్తఫా సల్లల్లాహు అలైహి వసల్లం ఆచరణ మరియు ఆదేశాల వెలుగులో స్త్రీల గొప్పతనాన్ని గౌరవాన్ని ఇలా తెలియజేసారు. స్త్రీల శిక్షణ తో సంతానము సన్మార్గంలో పయనమై స్వర్గం లో ప్రవేశిస్తుంది. దాన్ని ప్రవక్త ఇలా తెలియజేసారు "తల్లి పాదాల క్రింద స్వర్గం ఉన్నది" దీని వివరణ ఏమనగా స్త్రీ యొక్క మంచి శిక్షణ తో సంతానము మంచి సంఘము,మంచి సమాజము,మంచి దేశము మంచి వ్యవస్థలు ఏర్పడి ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయి అలాగే స్వర్గమయమైన సమాజం ఏర్పడుతుంది అని అన్నారు. అలాగే ఈ సమాజంలో ఉపయోగకరమైన సంతానము పరలోకంలో కూడా స్వర్గంలో ప్రవేశిస్తుంది అని అన్నారు అదేవిధంగా జమాఅత్ ప్రతి స్త్రీ మానవ విలువలతో కూడిన ఉత్తమ మైన శిక్షణను ప్రతీ తల్లి తమ ఒడిలోనుండి పిల్లల శిక్షణను ప్రారంభించి నిరంతరం కొనసాగించాలని తెలిపి విషయాలను గుర్తుచేసారు. అదేవిధంగా పోటీలలో గెలుపొందిన మహిళలకు బాలికలకు బహుమతులు అందజేశారు. అనంతరము దుఆతో ఈ వార్షిక సమావేశాలు విజయవంతంగా సాయంత్రం 6 గంటలకు విజయవంతంగా ముగిసాయి. ఈ సమావేశంలో జిల్లా కమిటీ గ్రామాల కమిటి సభ్యురాళ్ళు ఫర్జానా,ఆఫియ ఫాతిమా,మెహ్రున్నిసా,నజీమ, రేహానా, అలీమబేగం ,నజీమబేగం ,అజీమబేగం,ఫరీదబేగం,రెహానబేగం,సమీప,ఖతీజ,అంకూస్ బి, మదీహ ,అమీనా,అలీమ,కరిష్మ,యాస్మీన్,సుల్తానా,అనూష, మున్నీషబేగం ,సాలిహ, గోరీబి, కరీంబీ, పాల్గొన్నారు.

# మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్దన



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 20 ( జనం సాక్షి):** మండలంలోని పాపయ్యపేట గ్రామంలో మృతుడి కుటుంబాన్ని కాంగ్రెస్ మండల అధ్యక్షులు సిద్ధన రమేష్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి పరామర్శించారు.పాపయ్య పేట గ్రామానికి చెందిన సూర దూడయ్య గత కొద్దిరోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆదివారం దశ దిన కార్యక్రమానికి హాజరై మృతుడి చిత్ర పటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రధాన సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట అమీనాబాద్ సొసైటీ చైర్మన్ మొగిలి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ తప్పెట రమేష్, మాజీ సొసైటీ డైరెక్టర్ మజ్జిగ రాంబాబు, ఉప సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షులు బండి హరీష్, లింగాపురం గ్రామ కాంగ్రెస్ అధ్యక్షులు మచ్చిక కుమార స్వామి, శ్రీనివాస్, వినోద్, సదయ్య, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# క్రీడలతో మానసిక ఉల్లాసం

## బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్



**బెల్లంపల్లి, సెప్టెంబర్ 20, (జనంసాక్షి)**నిత్యం శారీరక వ్యాయామం చేయడంతో పాటు క్రీడల్లో పాల్గొనడం వల్ల మానసికోల్లాసంతో పాటు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని బెల్లంపల్లి రూరల్ సీఐ హనోక్ అన్నారు. బెల్లంపల్లి పట్టణంలోని తిలక్ క్రీడా మైదానంలో ఆదివారం తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ అథ్లెటిక్స్ పోటీలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహించారు. ఈ పోటీలను సీబీసీఐడీ రిటైర్డ్ అదనపు ఎస్పీ పులియాల రవికుమార్, వన్‌టౌన్ ఎస్సై రామకృష్ణతో కలిసి రూరల్ సీఐ హనోక్ ముఖ్య అతిథులుగా హాజరై జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ హనోక్ మాట్లాడుతూ వయసు కేవలం సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ 50 ఏళ్లు పైబడిన వారు నవ యువకుల్లా ఉత్సాహంగా, చురుగ్గా క్రీడల్లో పాల్గొనడం అభినందనీయమన్నారు. నేటి ఉరుకుల పరుగుల జీవన విధానంలో ఒత్తిడిని జయించేందుకు ప్రతి ఒక్కరూ నిత్యం వ్యాయామాన్ని దినచర్యలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. అనంతరం రిటైర్డ్ అదనపు ఎస్పీ పులియాల రవికుమార్ మాట్లాడుతూ తిలక్ మైదానంలో సాధన చేసిన ఎంతో మంది క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయిలో రాణించి పట్టణ ఖ్యాతిని నలుదిశలా చాటారని గుర్తుచేశారు. ఎంతో మందిలో క్రీడా స్ఫూర్తిని రగిలించిన చారిత్రాత్మక తిలక్ క్రీడా మైదానాన్ని ప్రభుత్వం, అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని అన్ని విధాలుగా అభివృద్ధి చేయాలని కోరారు. మైదానాన్ని ఆధునీకరిస్తే భవిష్యత్ తరాల యువత క్రీడల్లో మరింతగా రాణించే అవకాశం ఉంటుందని అభిప్రాయపడ్డారు. క్రీడా పోటీల్లో భాగంగా సీనియర్ సిటిజన్లు, వాకర్స్ కోసం స్పీడ్ వాక్, రన్నింగ్, షాట్‌పుట్, తాడులాగుడు తదితర పోటీలు నిర్వహించారు. అనంతరం వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచి విజేతలుగా నిలిచిన వారికి అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. క్రీడారంగానికి విశేష సేవలందించిన సీనియర్ క్రీడాకారులు యాదండ్ల నర్సయ్య, తోట పోచన్న, మాదాసి గోపాల్, గోవర్ధన్‌లను సంఘం తరఫున శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. పోటీల నిర్వహణలో కీలక పాత్ర పోషించి సాంకేతిక సహకారం అందించిన పీఈటీలు రాజ్ మహమ్మద్, బండి రవి, చంద్ పాషాలను ప్రత్యేకంగా అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో తిలక్ వాకర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగ రామన్న, ప్రధాన కార్యదర్శి కంటేవాడ నగేష్, కోశాధికారి కజ్జం రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# పాము కాటుకు పాడి గేదె మృతి



**దేవరుప్పుల, సెప్టెంబర్ 20 (జనం సాక్షి):**దేవరుప్పుల మండల కేంద్రానికి చెందిన తోటకూరి సోమయ్య, తండ్రి ఐలయ్యకు చెందిన పాడి గేదె పాము కాటుకు గురై మృతి చెందింది. తన వ్యవసాయ క్షేత్రంలో ఉన్న గేదెను ఉదయం చూసేందుకు వెళ్లగా అప్పటికే మృతి చెంది కనిపించడంతో రైతు సోమయ్య ఆవేదన వ్యక్తం చేశారు. పాడి గేదెను కోల్పోవడంతో కుటుంబానికి ఆర్థిక నష్టం వాటిల్లిందని, అధికారులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రభుత్వ సహాయం అందించాలని సోమయ్య కోరారు.

# మహిళల కోసం మహిళలతో ఏర్పడినది పరకాల ఇందిరా మహిళా డైరీ



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** :హనుమకొండ భవానినగర్ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నందు పరకాల మహిళా డెయిరీ అభివృద్ధి, భవిష్యత్ కార్యాచరణపై అధికారులు,పరకాల మహిళా డైరీ సభ్యులతో పరకాల శాసనసభ్యులు రేవూరి ప్రకాశ్ రెడ్డి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.పరకాల మహిళా డెయిరీ అభివృద్ధికి సంబంధించిన సమగ్ర కార్యాచరణ ప్రణాళికను వివరించారు.పాల సేకరణను పెంచడం, పాడి పశువుల నాణ్యతను మెరుగుపరచడం, మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయడం, పశువుల దాణా--పచ్చిమేత అందుబాటులోకి తీసుకురావడం, కృత్రిమ గర్భధారణ, మహిళా రైతులకు శిక్షణ వంటి వివిధ అంశాలపై ప్రభుత్వం అందిస్తున్న సహకారం, నిధుల వివరాలను తెలిపారు.పరకాల మహిళా డెయిరీ అభివృద్ధిలో కీలక ముందడుగుగా జాతీయ పాలాభివృద్ధి మండలి తో ఐదేళ్ల భాగస్వామ్యానికి అవగాహన ఒప్పందం కుదిరిందని అన్నారు.పాడి రైతులకు వారి శ్రమకు తగిన న్యాయమైన ధర లభించేలా చూడటంతో పాటు, పాల ఉత్పత్తిదారులు మధ్యవర్తులపై ఆధారపడాల్సిన అవసరం లేకుండా వ్యవస్థను బలోపేతం చేయాలని సూచించారు.ప్రభుత్వ సహకారంతో అధికారుల కృషితో, రాజకీయాలకు అతీతంగా పరకాల డైరీనీ అభివృద్ధి చేసుకుందాం అని,ప్రతి మహిళ పారిశ్రామికవేత్తగా తీర్చిదిద్దాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డి ఆర్ డి ఓ మేన శ్రీను సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు

# టేకుమట్ల వైన్స్‌పై కఠిన చర్యలు తీసుకోవాలి

## బీజేపీ మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్

**టేకుమట్ల, సెప్టెంబర్ 20 జనంసాక్షి** ::జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల మండల కేంద్రంలోని మద్యం దుకాణాల నిర్వహణపై వస్తున్న ఆరోపణలపై ప్రభుత్వం, ఎక్సైజ్ అధికారులు వెంటనే స్పందించి సమగ్ర విచారణ చేపట్టాలని భారతీయ జనతా పార్టీ టేకుమట్ల మండల అధ్యక్షుడు గుర్రపు నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు.టేకుమట్లలోని వైన్స్ దుకాణాల్లో మద్యం విక్రయాలు, ఎమ్మార్పీ ధరలు, దుకాణాల నిర్వహణ సమయాలు, బెల్ట్ షాపులకు మద్యం సరఫరా తదితర అంశాలపై స్థానికుల నుంచి ఆరోపణలు వస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ ఆరోపణలపై అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను ప్రజలకు వెల్లడించాలని కోరారు.మద్యం దుకాణాలు నిర్ణీత సమయాల కంటే ముందుగానే మూసివేస్తున్నారనే ఆరోపణలు నిజమైతే సంబంధిత వారిపై నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవాలని నాగరాజు గౌడ్ అన్నారు. సాధారణ వినియోగదారులకు ఎమ్మార్పీ ధరలకు మద్యం అందకుండా, అదనపు ధరలకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడితే దానిపై కూడా అధికారులు దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.అలాగే మద్యం సీసాల సీళ్ల విషయంలో వినియోగదారులు వ్యక్తం చేస్తున్న అనుమానాలను నివృత్తి చేసేందుకు సంబంధిత అధికారులు మద్యం నమూనాలను సేకరించి శాస్త్రీయ పరీక్షలు నిర్వహించాలని ఆయన కోరారు..టేకుమట్ల వైన్స్ దుకాణాలపై వస్తున్న ఆరోపణలను ప్రభుత్వం, ఎక్సైజ్ శాఖ అధికారులు తీవ్రంగా పరిగణించాలని గుర్రపు నాగరాజు గౌడ్ హెచ్చరించారు. వైన్స్ యాజమాన్యాలపై వచ్చిన ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘనలు నిర్ధారణ అయితే కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజల సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో మండల స్థాయిలో ఆందోళనలు చేపడతామని ఆయన హెచ్చరించారు. అవసరమైతే పెద్ద ఎత్తున ఉద్యమం చేపట్టి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొస్తామని స్పష్టం చేశారు.టేకుమట్ల మద్యం దుకాణాల వ్యవహారంపై ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి, పారదర్శకంగా విచారణ జరిపి ప్రజలకు వాస్తవాలను వెల్లడించాలని గుర్రపు నాగరాజు గౌడ్ డిమాండ్ చేశారు.



## దళితులు హక్కుల కోసం ఐక్యంగా ఉద్యమించాలి



**నల్లబెల్లి,సెప్టెంబరు20(జనంసాక్షి):** దళితులు సామాజిక, రాజకీయ, ఆర్థికంగా చైతన్యవంతులై, రాజ్యాంగం కల్పించిన హక్కులను సాధించడంతో పాటు సమాజ మార్పు కోసం ఐక్యంగా ఉద్యమించాలని దళిత మేధా శక్తి వ్యవస్థాపక అధ్యక్షుడు, న్యాయవాది బోట్ల పవన్ పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని అర్షనపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేద్కర్‌ను స్పూర్తిగా తీసుకుని దళిత యువత ఉన్నత విద్యను అభ్యసించి, తమ గ్రామాల్లో దళితుల అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. దళితులు ఐక్యమవుతూ చైతన్యవంతులవుతున్న నేపథ్యంలో వారిని విచ్ఛిన్నం చేసేందుకు అంబేద్కర్‌పై తప్పుడు ప్రచారాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి ప్రచారాల పట్ల దళిత సమాజం అప్రమత్తంగా ఉండాలని కోరారు. అనంతరం అర్షనపల్లి దళిత మేధా శక్తి గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు చెప్పారు. గ్రామ అధ్యక్షుడిగా ములుగు సుభాష్, ప్రధాన కార్యదర్శిగా దామెర ప్రమోద్, అధికార ప్రతినిధిగా రొట్టె రమేష్ ఎన్నికయ్యారు. కమిటీ సభ్యులుగా దామెర సదానందం, ములుగు శోభన్ ను ఎన్నుకున్నట్లు పవన్ తెలిపారు. ఈ సమావేశంలో దళిత మేధా శక్తి వ్యవస్థాపక సభ్యుడు పెంబర్తి శ్రీనివాస్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కుమ్మరి మధుకర్ తదితరులు పాల్గొన్నారు.

## మృతుడి కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎంపీపీ జక్క



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 20 ( జనం సాక్షి ):** మృతుడి కుటుంబాన్ని చెన్నారావుపేట మాజీ ఎంపీపీ, బిఆర్ఎస్ మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్ పరామర్శించారు. మండలంలో శంకరం తండా గ్రామానికి చెందిన భూక్య హనుమ తండ్రి భూక్య మంగ్య శనివారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఆయన ఆదివారం శంకరం తండాకు చేరుకుని మృతదేహం పై పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఆయన వెంట కొర్ర మోహన్, బద్రు, మోహన్, కడారి సాయిలు, మహేందర్ పాల్గొన్నారు.

## చేయూత... కొనసాగుతున్న వడపోత

### క్షేత్రస్థాయి పరిశీలనలో అధికారులు



**కెరమెరి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి)** కెరమెరి మండలంలో చేయూత పెన్షన్ల పథకం దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ ముమ్మరంగా కొనసాగుతోంది. దరఖాస్తుల గడువు ఈ నెల 16 న ముగిసిన నేపథ్యంలో అర్హులైన లబ్ధిదారులను గుర్తించేందుకు అధికారులు ఇంటింటా తిరుగుతూ క్షేత్రస్థాయిలో పరిశీలన నిర్వహిస్తున్నారు. దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి అధికారులు పరిశీలన చేసి, లబ్ధిదారుల వివరాలను ప్రత్యేక యాప్ లో నమోదు చేస్తున్నారు. అర్హత ఉన్న వారికి మాత్రమే పథకం వర్తింపజేయనున్నట్లు అధికారులు తెలిపారు. మండలంలో ఎంపీడీవో అంజత్ పాషా ఆధ్వర్యంలో పంచాయతీ సెక్రటరీలు గ్రామాల్లో పర్యటిస్తూ దరఖాస్తులను పరిశీలిస్తున్నారు.

## వరంగల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం జేపీసీ అధ్యక్షుడిగా దండెం సంపత్



**నల్లబెల్లి, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా నారక్కపేట గ్రామా సర్పంచ్ దండెం సంపత్‌ను నియమించినట్లు ఆ సంఘం వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ మేరకే సంపత్‌కు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సుర్వి యాదయ్య గౌడ్ మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమకారుడు, మాజీ మంత్రి, తెలంగాణ సర్పంచ్‌ల సంఘం జేఏసీ గౌరవ అధ్యక్షుడు వి. శ్రీనివాస్ గౌడ్ ఆదేశాల మేరకు వరంగల్ జిల్లా సర్పంచ్‌ల సంఘం జేఏసీ అధ్యక్షుడిగా సంపత్‌ను నియమించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీలకు స్టేట్ ఫైనాన్స్ కమిషన్ (ఎస్ఎఫ్‌సీ) నిధులను ప్రతినెలా విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సర్పంచులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడంతో పాటు వారి గౌరవ వేతనాన్ని పెంచాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన దండెం సంపత్ మాట్లాడుతూ.. వరంగల్ జిల్లాలోని సర్పంచ్‌ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, వారి హక్కుల పరిరక్షణకు సంఘం తరఫున ముందుండి పనిచేస్తానని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌ల సంఘం కార్యదర్శి మెడెం సాగర్‌తో పాటు సర్పంచుల సంఘం జేఏసీ నాయకులు, మాజీ సర్పంచులు పాల్గొన్నారు.

## రజక సంఘం మండల అధ్యక్షుడిగా సంగెం రామ చంద్రు



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 20( జనం సాక్షి):** రజక సంఘం మండల అధ్యక్షుడిగా సంగెం రామచంద్రుని ఎన్నుకున్నారు. ఆదివారం చెన్నారావుపేట మండల కేంద్రంలో రజక సంఘం మండల కమిటీ ఎన్నికలను నిర్వహించారు. నర్సంపేట నియోజకవర్గ గౌరవాధ్యక్షులు పోదిల రామచందర్ రజక, రిజర్వేషన్ సమితి జిల్లా అధ్యక్షులు సంగెం రమేష్ పరిశీలకులుగా హాజరయ్యారు. మండల అధ్యక్షులుగా జల్లి గ్రామానికి చెందిన సంగెం రామచంద్రు, ఉపాధ్యక్షుడిగా ఆరెల్లి కుమారస్వామి ( లింగాపురం), ప్రధాన కార్యదర్శిగా ఉప్పుల వీరస్వామి (చెన్నారావుపేట), కార్యవర్గ సభ్యులుగా నీలగిరి రవి, గూడెల్లి యాకయ్య, నాగెల్లి సాంబయ్య, కొత్తపెల్లి ప్రభాకర్, నరసయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన అధ్యక్షులు రామచంద్రు మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి మండల అధ్యక్షుడిగా ఎన్నుకున్నందుకు రజక బంధవులందరికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ గౌరవ అధ్యక్షులు పోదిల రామచందర్, జిల్లా రజక రిజర్వేషన్ సమితి అధ్యక్షులు సంగెం రమేష్, రామచంద్రు, వీరస్వామి, కుమారస్వామి, ఓరుగంటి అశోక్, కార్యవర్గ సభ్యులు, కుల సభ్యులు, పాల్గొన్నారు.

## తాడిచర్ల ఏఎంఆర్‌లో లక్ష పలికిన గణేష్ లడ్డు



**మల్హార్,సెప్టెంబర్ 20(జనంసాక్షి)** వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని తాడిచెర్లలోని ఏఎమ్ఆర్ కంపెనీలో గణేష్ లడ్డు వేలం పాటను ఘనంగా నిర్వహించారు. ఈ వేలంలో జూనియర్ మైనింగ్ ఇంజినీర్లు ఉత్సాహంగా పాల్గొని హోరాహోరీగా వేలం నిర్వహించారు. చివరకు రూ. లక్షా రెండు వేలు అత్యధిక ధర పలకడంతో జేఎంఈల బృందం గణేష్ లడ్డును కైవసం చేసుకుంది. వేలం సందర్భంగా ఉద్యోగుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సీనియర్ వైస్ ప్రెసిడెంట్ ప్రభాకర్ రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ మూర్తి, మేనేజర్ శ్రీనివాస్, సేఫ్టీ ఆఫీసర్ సురేష్ బాబు హాజరై వేలం కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. వివిధ విభాగాలకు చెందిన అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వినాయక చవితి సందర్భంగా నిర్వహించిన ఈ లడ్డు వేలం ఉద్యోగుల మధ్య ఐక్యత, సోదరభావం, భక్తి భావాలను ప్రతిబింబించేలా ఉత్సాహభరిత వాతావరణంలో సాగింది.

## విజయసాయి పాఠశాల ఉపాధ్యాయులకు 'బెస్ట్ టీచర్' అవార్డులు: ఘనంగా సన్మానం




**కుంటాల, సెప్టెంబర్ 20(జనం సాక్షి ):** నిర్మల్ జిల్లా కేంద్రంలోని ఆర్.కె. ఫంక్షన్ హాల్‌లో ఈ నెల 18వ తేదీన ట్రెస్మా రాష్ట్ర మరియు జిల్లా యాజమాన్యాల ఆధ్వర్యంలో 2026-2027 సంవత్సరానికి గాను బెస్ట్ టీచర్ అవార్డుల ప్రధానోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకలో విజయసాయి పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు ఎ. మురళీకృష్ణ మరియు పి. సందీప్ బెస్ట్ టీచర్ అవార్డులను అందుకున్నారు. జిల్లా స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డులు సాధించి, పాఠశాల పేరు నిలబెట్టినందుకు గాను విజయసాయి పాఠశాల యాజమాన్యం, సిబ్బంది వారిని ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ స్వప్న మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తు కోసం అంకితభావంతో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు ఈ గౌరవం దక్కడం గర్వకారణమని హర్షం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం

**దిలావర్‌పూర్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి):** దిలావర్పూర్ మండలంలోని సిర్గాపూర్ గ్రామంలోని గురడికాపు సంఘ భవనంలో సోమవారం (సెప్టెంబర్ 21) ఆయుర్వేద, హోమియోపతి మెగా వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ఆయుష్ శాఖ జిల్లా ఇన్‌చార్జి డాక్టర్ ఎ. నారాయణరావు, రాష్ట్ర ఆయుష్ పార్మసిస్టుల అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కొప్పుల నర్సారెడ్డి తెలిపారు. ఈ వైద్యశిబిరంలో ప్రజలకు ఆయుర్వేద, హోమియోపతి వైద్య సేవలు అందించనున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు కోరారు.

## ఢిల్లీ వర్సిటీ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం

### జాతీయవాదుల విజయానికి నిదర్శనం: రావుల రాంనాథ్



**నిర్మల్ టౌన్, సెప్టెంబర్ 20,(జనంసాక్షి ):** ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యార్థి సంఘ ఎన్నికల్లో ఏబీవీపీ ఘన విజయం సాధించడంపై బీజేపీ రాష్ట్ర నాయకుడు రావుల రామనాథ్ హర్షం వ్యక్తం చేశారు. అధ్యక్ష, కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి తదితర కీలక స్థానాల్లో ఏబీవీపీ అభ్యర్థులు భారీ మెజార్టీతో విజయం సాధించడం జాతీయవాదుల విజయానికి నిదర్శనమన్నారు. ఎన్ఎస్‌యూఐతో పాటు పలు రాజకీయ పార్టీల అనుబంధ విద్యార్థి సంఘాలు కలిసి పోటీ చేసినప్పటికీ ఒక్క స్థానాన్ని కూడా గెలుచుకోలేకపోయాయని పేర్కొన్నారు. విద్యార్థులను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలకు ఢిల్లీ యూనివర్సిటీ ఎన్నికల ఫలితాలు సమాధానమిచ్చాయని అన్నారు. జాతీయవాదులు, దేశభక్తులతో పోరాటం చేయడం నిప్పుతో చెలగాటం వంటిదని ఇప్పటికైనా ప్రతిపక్షాలు గ్రహించాలని సూచించారు. తప్పుడు ప్రచారాలకు స్వస్తి పలికి వాస్తవాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కాంగ్రెస్‌కు హితవు పలికారు.

## గణపయ్యను దర్శించి ప్రత్యేక పూజలు చేసిన డీఎస్పీ శ్రీనివాస్



**ఖానాపూర్ సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** నిర్మల్ డిఎస్పీ శ్రీనివాస్ పట్టణంలోని గణపతి మండపాలను దర్శించి గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వినాయక నిమజ్జన ఉత్సవాలను శాంతియుత, ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా జరుపుకోవాలని మండపాల నిర్వాహకులకు, ఉత్సవ సమితి సభ్యులకు సూచించారు. నిమజ్జన ఊరేగింపు సాగే మార్గాలను ఉత్సవ సమితి అధ్యక్షుడు మంత్రరాజ్యం సురేష్, ప్రధాన కార్యదర్శి శెట్టి శ్యామ్ మోహన్ రావు లను అడిగి తెలుసుకున్నారు. మండపాల నిర్వాహకులు సమయ పాలన పాటించాలని, డీజేల వినియోగంపై పోలీస్ నిబంధనలను ఖచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. పండుగను ప్రశాంతంగా జరుపుకోవడానికి పోలీసు రక్షణ వ్యవస్థకు ప్రజలు, ఉత్సవ కమిటీ సభ్యులు పూర్తి సహకారం అందించాలని కోరారు. డీఎస్పీ వెంట సిఐ సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్ గైక్వాడ్, తదితరులు ఉన్నారు.

## పాంచజన్య సంకల్ప సభలో టిఆర్ఎస్

### ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు



**నెరడిగొండ సెప్టెంబర్20(జనంసాక్షి):** ముఖ్యమంత్రి సొంత గడ్డపై తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవితమ్మ నేతృత్వంలో ఆదివారం రోజున నిర్వహించిన సభకు ఆదిలాబాద్ జిల్లా తెలంగాణ రక్షణ సేన అధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాంచజన్య సంకల్ప సభను విజయ వంతం చేసిన మహబూబ్ నగర్ జిల్లా వాసులందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతూ మహబూబ్ నగర్ జిల్లా,మా ఆదిలాబాద్ జిల్లా ఇప్పటికీ అభివృద్ధి చెందలేవని గత ప్రభుత్వం,ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధి ఏం చేయడం లేదని, ఇప్పుడు వచ్చిన కవితమ్మ మరో ఝాన్సీ రాణి రుద్రమ్మ దేవిలా పోరాటం మొదలు పెట్టింది అని, రాబోయే ఎన్నికల్లో టీఆర్ఎస్ పార్టీని గెలిపించి కవితమ్మను సీఎం చేసి అభివృద్ధి చేసుకుందామని పేర్కొన్నారు.

## విట్టపూర్‌లో పిడుగుపాటు

### రెండు గొర్రెలు మృతి, ముగ్గురికి తీవ్ర గాయాలు



**కుంటాల,సెప్టెంబర్20(జనంసాక్షి):** విట్టపూర్ గ్రామంలో హఠాత్తుగా సంభవించిన పిడుగుపాటు తీవ్ర కలకలం రేపింది. ఈ ప్రమాదంలో రెండు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, ముగ్గురు వ్యక్తులు తీవ్రంగా గాయపడ్డారు. గాయపడిన వారిని గ్రామానికి చెందిన బి. చిన్న సాయన్న, బి. లింగన్న, మరియు ధనుష్ గా గుర్తించారు.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. బాధితులు తమ గొర్రెలతో కలిసి ఉండగా ఒక్కసారిగా వాతావరణం మారి పిడుగు పడింది. ఈ ప్రమాదంలో గొర్రెలు ప్రాణాలు కోల్పోగా, తీవ్రంగా గాయపడిన ముగ్గురిని గ్రామస్థులు వెంటనే చికిత్స నిమిత్తం సమీప ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆసుపత్రిలో వారికి వైద్యులు అత్యవసర చికిత్స అందిస్తున్నారు. పిడుగుపాటుకు గురైన బాధితులను ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని, నష్టపరిహారం అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## మంచిర్యాల సేవ భారతి అధ్వర్యంలో 5 కె/10 కె రన్




**మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 20, జనం సాక్షి** సేవ భారతి ఆధ్వర్యంలో ఆదివారం మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తా నుండి నిర్వహించిన 5ఖ/10ఖ రన్‌లో 1200 పైగా యువతి యువకులు, మహిళలు, వాకర్స్, రన్నర్స్, డాక్టర్లు, ఉద్యోగులు , అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఉత్సాహంగా జరిగిన రన్ కు సేవ భారతి రాష్ట్ర సభ్యులు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్ జెండా ఊపి ప్రారంభించారు. ఫిట్ ఇండియా లో భాగంగా ఫిట్ మంచిర్యాల నినాదంతో ప్రతి ఒక్కరూ తాము ఆరోగ్యంగా ఉండడానికి నిత్యం ఫిట్ నెస్ సాధన చేయాలనే ఉద్దేశంతో నిర్వహించడం జరిగింది. ఈ రన్ లో పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొనడం అభినందనీయం అని ప్రతి ఒక్కరు ఫిట్ మంచిర్యాల లో భాగస్వామ్యం అయ్యి నిత్యం ఫిట్నెస్ పై దృష్టి సారించాలి రఘునాథ్ గారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏకాలవ్య ఆశ్రమం అధ్యక్షులు ఓడ్నాల లక్ష్మి నారాయణ, బీజేపీ మంచిర్యాల జిల్లా అధ్యక్షులు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, గాజుల ముఖేష్ గౌడ్, కస్తూరి నాగరాజు, బోట్ల సత్యం, అమిరిశెట్టి రాజ్ కుమార్, రంగ శ్రీశైలం, సత్రం రమేష్, కుర్రె చక్రవర్తి, బియ్యాల సతీష్ రావు, డేగ బాపు, ఆకుల అశోక్ వర్ధన్, ఆడే ప్రేమ్ సింగ్, పచ్చ స్వప్న రాణి, బింగి ప్రవీణ్, నాంపల్లి శ్రీనివాస్ మరియు తదితరులు పాల్గొన్నారు.

## జన్నారంలో సంక్షోభ అనుకరణలు, చర్చలతో

## స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో జిఐ - ఎంయూఎన్ 3.0 ముగింపు

**జన్నారం, సెప్టెంబర్ 20, జనంసాక్షి:** స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడవ గ్లోబల్ ఇంటర్నెట్ మోడల్ యునైటెడ్ నేషన్స్ (జిఐ - ఎంయూఎన్ 3.0) సదస్సు ఆదివారం జన్నారంలో ఘనంగా ముగిసింది. సెప్టెంబర్ 18 నుంచి 20 వరకు స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రాంగణంలో జరిగిన ఈ మూడు రోజుల కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు పాల్గొని సంక్షోభ అనుకరణలు, పార్లమెంటరీ చర్చలు, అంతర్జాతీయ అంశాలపై చర్చలు నిర్వహించారు. మొదటి రోజు కార్యక్రమాన్ని ముఖ్య అతిథి శ్రీ ఎ. యుగేందర్ రెడ్డి, రిటైర్డ్ ఐపీఎస్ కమిషనర్, నవోదయ విద్యాలయ సమితి, భారత ప్రభుత్వ విద్యాశాఖ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో స్లేట్ గ్రూప్ ఆఫ్ స్కూల్స్ వ్యవస్థాపకులు శ్రీ ఎ. సుభాష్ రెడ్డి, చైర్మన్, సీఈఓ డా. ఎ. శ్రీకాంత్ రెడ్డి, స్లేట్ ఎక్సలెన్స్ స్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి షిరిన్ ఖాన్ గారు, స్లేట్ హైస్కూల్ ప్రిన్సిపాల్ శ్రీమతి ప్రియశివ గారు పాల్గొన్నారు. ఈ సదస్సులో నాలుగు కమిటీల్లో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. లోక్‌సభలో స్పీకర్‌గా ఎ. సుమిత్ రెడ్డి, డిప్యూటీ స్పీకర్‌గా ఎం.డి. రమ్యకుమారి వ్యవహరించారు. మొదటి రోజు వివిధ జాతీయ అంశాలపై చర్చ జరిగింది. ఇందులో రాహుల్ గాంధీ, డా. శశి థరూర్, శ్రీ నితిన్ గడ్కరీ, డా. ఎస్. జైశంకర్ తదితర ప్రముఖుల పాత్రలను విద్యార్థులు ప్రతినిధులుగా పోషించారు. రెండో రోజు భారత్--పాకిస్థాన్ సరిహద్దుల్లో జరిగిన ఉగ్రవాద ఘటనల నేపథ్యంలో సంక్షోభ ప్రతినిధుల కార్యక్రమం నిర్వహించారు. ప్రజాధాన్యానికి జవాబుదారీతనం, లైంగిక హింస నుంచి బయటపడిన బాధితుల రక్షణ, పరిహార ప్రక్రియలు తదితర అంశాలపై విద్యార్థులు చర్చించారు. శ్రీ అఖిలేష్ యాదవ్, శ్రీ బండి సంజయ్ కుమార్ తదితరుల పాత్రలను కూడా విద్యార్థులు ప్రతినిధులుగా పోషించారు. రాజ్యాంగసభలో చైర్‌గా అవినాష్ రఘుల, కో-చైర్‌గా సాయి హర్షిత్ వ్యవహరించారు. మొదటి రోజు డిజిటల్ యుద్ధం, రక్షణ సాంకేతికతపై కొరియా, వియత్నాం, జపాన్, బ్రెజిల్, భారత్, సింగపూర్, యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్ తదితర దేశాల ప్రతినిధులు చర్చించారు. రెండో రోజు "ఆపరేషన్ సింధూర్"





సైనిక చర్యకు సంబంధించిన అంశాలపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సైబర్ భద్రత అంశంపై ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ప్రతినిధుల మధ్య వాదోపవాదం జరిగింది. యునెస్కో కమిటీలో చైర్‌గా మునుజ్జా మరియం, కో-చైర్‌గా టీ. "సహస్ర వ్యవహరించారు. వారసత్వ పరిరక్షణలో కృత్రిమ మేధస్సు వినియోగంపై చర్చించారు. మొదటి రోజు రష్యా, స్పెయిన్, డెన్మార్క్, స్వీడన్, మెక్సికో, ఉత్తర కొరియా, జపాన్, అమెరికా తదితర దేశాల ప్రతినిధులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. రెండో రోజు రష్యా, ఫ్రాన్స్, స్పెయిన్, అమెరికా ప్రతినిధులు చర్చలో పాల్గొన్నారు. మూడు రోజుల పాటు నిర్వహించిన ఈ సదస్సు ముగింపు కార్యక్రమంతో ఆదివారం ముగిసింది. కార్యక్రమంలో సెక్రటరీ జనరల్ డా. ఎ. శ్రీకాంత్ రెడ్డి, ఎంటీఎంఎస్ నిజామాబాద్‌కు చెందిన శ్రీ జనార్ధన్ రెడ్డి, ప్రసంగించారు. అనంతరం ప్రతిభ కనబరిచిన ప్రతినిధులకు అవార్డులు అందజేసి విజేతలను ప్రకటించారు.

## ఆర్ డి ఎఫ్ జూనియర్ కాలేజీలో పరుగు పందెం పోటీలు

**పర్వతగిరి , సెప్టెంబర్ 20: (జనం సాక్షి)**యువతలో ఆరోగ్య చైతన్యం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఆర్డీఎఫ్--వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వామి వివేకానంద రన్--కల్లెడ' 5 కిలోమీటర్ల స్నేహపూర్వక పరుగు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 220 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన పరుగు బూర్గుమళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వరకు సుమారు 5 కిలోమీటర్లు కొనసాగింది. విద్యార్థులు, యువత, క్రీడాకారులు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యంపై అవగాహన చాటారు.

**యువతకు ఆరోగ్య సందేశం**

మారుతున్న జీవనశైలిలో శారీరక శ్రమ తగ్గుతున్న నేపథ్యంలో నడక, పరుగు, వ్యాయామం వంటి ఆరోగ్యకరమైన అలవాట్లను అలవర్చుకోవాల్సిన అవసరం ఉందని నిర్వాహకులు తెలిపారు. 'ఆరోగ్యవంతమైన యువత--బలమైన సమాజం' అనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశమన్నారు.స్వామి వివేకానంద ఆశయాలను యువతలోకి తీసుకెళ్లడంతో పాటు ధైర్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసం, దేశభక్తి వంటి విలువలను పెంపొందించేందుకు ఈ పరుగు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమానికి ఎలికట్టె వేణు మరియు ప్రతాప్ రెడ్డి గారు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎ. రాజు, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ సతీష్, పీడీ బి. రాజు, అధ్యాపకులు జయశంకర్, మహేశ్వర్, సైదులు, సంతోష్, దంజ్య, గుంషావళి, ప్రవీణ్, శ్రీలత, ధనలక్ష్మి, తిరుమల తదితరులు పాల్గొన్నారు.పరుగులో ప్రతిభ కనబరిచిన మొదటి 10 మంది విజేతలకు టీ షర్ట్, మెడల్, మెరిట్ ధ్రువపత్రాలు, 11 నుంచి 20వ స్థానం వరకు నిలిచిన వారికి షీల్డులు, పాల్గొన్న ధ్రువపత్రాలు అందజేశారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి కళాశాల నిర్వాహకులు కృతజ్ఞతలు తెలిపారు.యువతలో ఆరోగ్య చైతన్యం, శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, క్రీడాస్ఫూర్తి, దేశభక్తి భావాలను పెంపొందించేందుకు ఆర్డీఎఫ్--వనితా అచ్చుతా పాయి విద్యాలయ జూనియర్ కళాశాల ఆధ్వర్యంలో నిర్వహించిన 'స్వామి వివేకానంద రన్--కల్లెడ' 5 కిలోమీటర్ల స్నేహపూర్వక పరుగు విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమంలో సుమారు 220 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు.ఆదివారం ఉదయం కళాశాల ప్రాంగణం నుంచి ప్రారంభమైన పరుగు బూర్గుమళ్ల గ్రామంలోని ప్రాథమిక పాఠశాల వరకు సుమారు 5 కిలోమీటర్లు కొనసాగింది. విద్యార్థులు, యువత, క్రీడాకారులు, గ్రామీణ ప్రాంత ప్రజలు ఉత్సాహంగా పాల్గొని ఆరోగ్యంపై అవగాహన చాటారు.



## బీజేపీ ఎస్టి మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మండల అధ్యక్షుల నియామకం

**కాసిపేట సెప్టెంబర్20 ( జనం సాక్షి )** భారతీయ జనతా పార్టీ (బీజేపీ) ఎస్టీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి బాలరాజ్ మరియు కాసిపేట మండల అధ్యక్షుడిగా భూక్యా నాగరాజు నియమితులు అయ్యారు . ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు వారికి శుభాకాంక్షలు తెలిపారు. కాసిపేట మండలంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ,ఎస్టీ మోర్చా కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానని జిల్లా ఉపాధ్యక్షులు రెడ్డి బాలరాజ్ మండల అధ్యక్షులు నాగరాజు తెలిపారు. మండలంలోని గిరిజన ప్రజల సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని అన్నారు. నమ్మకంతో బాధ్యత అప్పగించిన పార్టీ నాయకులకు, కార్యకర్తలకు బాలరాజు, నాగరాజు కృతజ్ఞతలు తెలిపారు. నూతన బాధ్యతతో పార్టీ కార్యక్రమాలను మరింత చురుకుగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. తనకు ఈ పదవి రావడానికి కృషిచేసిన బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు వేరబెల్లి రఘునాథ్ కి బిజెపి జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్ కి బిజెపి ఎస్టీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ప్రేమ్ సింగ్ కి కాసిపేట మండల బిజెపి అధ్యక్షుడు సూరం సంపత్ కుమార్‌కి కృతజ్ఞతలు తెలిపారు

# నిర్మల్‌లో గుండె వైద్యానికి కొత్త భరోసా

### స్వప్న ఆసుపత్రిలో 'శశి హార్ట్ కేర్ సెంటర్' ప్రారంభం



**నిర్మల్ బ్యూరో , సెప్టెంబర్ 20 (జనం సాక్షి):** గుండె సంబంధిత అత్యవసర వైద్య సేవలు ఇక స్థానికంగానే అందుబాటులోకి రానున్నాయి. నిర్మల్‌లోని స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన 'శశి హార్ట్ కేర్ సెంటర్'లిలిను శనివారం ప్రారంభించారు. దీంతో గుండెపోటు, ఇతర హృదయ సంబంధిత సమస్యలకు అవసరమైన వైద్య సేవలు జిల్లాలోనే పొందే అవకాశం ఏర్పడింది. కార్డియాలజీలో ప్రత్యేక శిక్షణ పొందిన డాక్టర్ కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో హృదయ వైద్య సేవలు అందించనున్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. గుండె సంబంధిత వ్యాధుల నిర్ధారణకు అవసరమైన పరీక్షలతో పాటు వైద్యుల సూచన మేరకు యాంజియోగ్రామ్, స్టెంట్ తదితర సేవలు అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు.

**అత్యవసర వేళ సమయమే కీలకం**

గుండెపోటు వంటి అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో చికిత్స అందించడం కీలకం. ఇప్పటివరకు అత్యవసర గుండె వైద్యం కోసం హైదరాబాద్, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండేదని, స్థానికంగానే కార్డియాక్ సేవలు అందుబాటులోకి రావడంతో ఈ ఇబ్బంది కొంతమేర తగ్గే అవకాశం ఉందని నిర్వాహకులు తెలిపారు. స్వప్న మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో ఇప్పటికే జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జరీ, చిన్నారుల వైద్యం, అత్యవసర చికిత్స తదితర సేవలు అందుతున్నాయి. ఆరోగ్యశ్రీ పరిధిలోనూ పలు వైద్య సేవలు, శస్త్రచికిత్సలు అందిస్తున్నట్లు తెలిపారు.

**వైద్యంతో పాటు సేవా కార్యక్రమాలు**

డాక్టర్ నాళం శశికాంత్, డాక్టర్ నాళం స్వప్న దంపతులు వైద్య సేవలతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు. ఉచిత అంబులెన్స్ సౌకర్యాలు, తల్లులు--శిశువుల ఆరోగ్య పరిరక్షణకు మదర్ ఫీడింగ్ బ్యాంకుల ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిర్మల్‌లో కార్డియాక్ సేవలు అందుబాటులోకి రావడంతో జిల్లా ప్రజలకు అత్యవసర గుండె వైద్యంలో మరో సౌకర్యం చేరినట్లయింది.

# రహదారి నిర్మాణానికి నిధులు మంజూరు: గుమ్మడి సోమయ్య

### నిధుల మంజూరుకు సహకరించిన మంత్రి సీతక్కకు పాలాభిషేకం చేసిన నాయకులు





**మంగపేట సెప్టెంబర్ 20(జనంసాక్షి)** ములుగు నియోజకవర్గంలో అభివృద్ధిని చూసి ఓర్వలేకనే కొందరు నిత్యం అసత్య ప్రచారాలు చేస్తున్నారని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ గుమ్మడి సోమయ్య మండిపడ్డారు. ఆదివారం కమలాపురం గ్రామంలో జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య అధ్యక్షతన అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గుమ్మడి సోమయ్య హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ప్రత్యేక చొరవతో ఏటూరునాగారం, బూర్గంపహాడ్ రహదారికి సుమారు రూ. 44 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. దసరా లోపు టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, త్వరలోనే పనులు ప్రారంభిస్తామని స్పష్టం చేశారు. ప్రస్తుతం ఆ రోడ్డులోని గుంతలను తాత్కాలికంగా పూడ్చినప్పటికీ, వర్షాల కారణంగా మళ్లీ గుంతలు ఏర్పడుతున్నాయని, దీనిని రాజకీయ లబ్ధి కోసం తప్పుగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రజలు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన తెలిపారు. గత పదేళ్ల పాలనలో ఏం అభివృద్ధి చేశారో, ప్రస్తుత రెండున్నర ఏళ్ల ప్రజా పాలనలో ములుగు నియోజకవర్గం ఎలా అభివృద్ధి చెందుతుందో బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. ములుగు నియోజకవర్గంలో వందల కోట్ల రూపాయలతో అనేక అంతర్గత రోడ్లు పూర్తి చేశామని, ఇచ్చిన ప్రతి హామీని దశలవారీగా నెరవేరుస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం నిధుల మంజూరుకై ప్రత్యేక కృషి చేసిన మంత్రి సీతక్క చిత్రపటానికి నాయకులు పాలాభిషేకం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా, నియోజకవర్గం, బ్లాక్ కాంగ్రెస్, మండల అలాగే గ్రామ స్థాయి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# బెల్ట్ షాపుల్లో అక్రమ మద్యం విక్రయాలు నియంత్రించాలి

### ఎక్సైజ్ సిఐకి గ్రామస్తుల వినతి



**మంచిర్యాల ప్రతినిధి సెప్టెంబర్ 20 జనం సాక్షి** బెల్ట్ షాపులలో మద్యం విచ్చలవిడిగా విక్రయాలు సాగుతూ ఉండడంతో అక్రమ మద్యం మూలంగా ఎన్నో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని యువకులు, గ్రామస్తులు తమ గ్రామంలో బెల్ట్ షాపులు మూసివేయాలని ఎక్సైజ్ సిఐకి వినతి పత్రం అందజేశారు. మంచిర్యాల జిల్లా చెన్నూరు మండలం ఆస్నాద్ గ్రామంలో బెల్ట్ షాపులను వెంటనే మూసివేసి, అక్రమ విక్రయాలను అరికట్టాలని కోరుతూ ఎక్సైజ్ శాఖ అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రాజకీయాలకు అతీతంగా సుమారు 200 మంది మహిళలు యువకులు ఎక్సైజ్ కార్యాలయానికి వెళ్లి గ్రామంలో జరుగుతున్న అక్రమ మద్యం వ్యాపారం పై అధికారులకు విన్నవించారు.ప్రతినెల తమ గ్రామంలో బెల్టు షాపుల ద్వారా సుమారు 10 లక్షల రూపాయల వ్యాపారం జరుగుతుందని దీని వలన కొన్ని కుటుంబాలు రోడ్డుపాలవుతున్నాయని ఇప్పటికైనా బెల్ట్ షాపులను నియంత్రించాలని వారు పేర్కొన్నారు. కిరాణా షాప్ లు వైన్ షాపులకు దీటుగా 24 గంటలు మద్యం విక్రయాలు చేపడుతున్నాయని దీని మూలంగా విద్యార్థులు, యువత తాగుడుకు బానిసలై ప్రాణాలు కోల్పోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకముందు గ్రామంలో కిరాణా షాపులలో ఎవరైనా అక్రమ మద్యం విక్రయిస్తే అధికారులతో పాటు తాము కూడా చర్యలు తీసుకుంటామని గ్రామస్తులు పేర్కొన్నారు

# ఉత్సాహంగా నీరజ ఓరుగల్లు స్వరాల జల్లు

- పాత కొత్త పాటలతో అలరింప చేసిన గాయకులు
- 12 గంటల పాటు కార్యక్రమం



**వరంగల్ ఈస్ట్, సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** వరంగల్ నగరంలో పాటలు పాడే గాయకులంతా ఒక వేదిక గా ఏర్పడి తమ పాటలతో అలరింపజేశారు. నీరజ ఓరుగల్లు స్వరాలజల్లు సీజన్‌బి 27 ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం 9 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు వందలాదిమంది గాయకులు తమ పాత కొత్త పాటలతో ఉత్సాహాన్ని ఆనందాన్ని పంచుకున్నారు. నిర్వాహకులు పుల్లఖండం నీరజ సారథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా వివిధ జిల్లాల నుంచి వచ్చినటువంటి కళాకారులు ఒక్కొక్కరు మూడు పాటల చొప్పున పాడి తమ కళా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఆహుతులను ఆనందింప చేశారు. ఈ గాయకులందర్నీ నిర్వాహకులు సన్మానించి సత్కరించారు. ఈ సందర్భంగా కళాకారులను ప్రోత్సహిస్తూ ఒక వేదిక మీద తమ ప్రదర్శనలు ఇచ్చే విధంగా నిరంతరం కృషి చేస్తున్న నీరజ ఓరుగల్లు స్వరాలు జల్లు నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో పుల్లఖండం నీరజ, సత్యనారాయణ, కళాకారులకు అన్నదాత వల్లం రమేష్, ఏసిపి విజయ్ కుమార్, విల్సన్, హరినాధరావు, హరిప్రియ, పద్మజ, శ్రీకాంత్, కవిత మొదలైన గాయకులు పాల్గొన్నారు.

# అత్యవసర సిజేరియన్‌తో శిశువుకు పునర్జన్మ

### ఆసిఫాబాద్ జీజీహెచ్‌లో వైద్యుల సకాల స్పందన



**కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబర్ 20(జనంసాక్షి ):** ఆసిఫాబాద్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీ జీ హెచ్ )లో వైద్యులు అత్యవసరంగా స్పందించి క్లిష్ట పరిస్థితుల్లో ఉన్న ఓ శిశువును కాపాడారు. శిశువు పరిస్థితి అత్యంత విషమంగా ఉండటంతో వైద్యులు వెంటనే ఆపరేషన్ నిర్వహించి సురక్షిత ప్రసవం చేశారు. క్లిష్ట పరిస్థితుల్లోనూ వైద్యులు, నర్సింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి తల్లి, శిశువుకు అవసరమైన చికిత్స అందించారు. ప్రస్తుతం శిశువును వైద్యుల పర్యవేక్షణలో ఉంచి అవసరమైన వైద్యం అందిస్తున్నారు. అత్యవసర సమయంలో వైద్య బృందం వేగంగా స్పందించి శిశువును కాపాడటంపై కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు.

# ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు
- జిల్లా కలెక్టరేట్, ఆర్డీవో, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం

**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 20(జనంసాక్షి).** ప్రజా సమస్యల పరిష్కారానికి నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ములుగు జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ములుగు జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు ములుగు ఆర్డీవో కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాల్లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిధిలో జిల్లా స్థాయి అధికారులు, రెవెన్యూ డివిజన్ పరిధిలో రెవెన్యూ డివిజన్ అధికారులు, మండల స్థాయిలో మండల స్థాయి అధికారులు ప్రజావాణి నిర్వహించాలని ఈ ప్రజావాణిలో ప్రజల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## మృతురాలు కుటుంబాన్ని పరామర్శ

# ఎమ్మెస్పీ రాష్ట్ర నాయకులు ఆర్థిక సహాయం



**మహదేవపూర్: సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం సూరారం గ్రామానికి చెందిన ఎం ఎం సి మాదిగ మహిళా సమైక్య మొదటి తరం నాయకురాలు జిల్లెల్ల కొండమ్మ అకాల మరణం చెందినందున ఆదివారం ఏడవ రోజు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి రాష్ట్ర నాయకులు అంబాల చంద్రమౌళి హాజరై మృతురాలకు ప్రగాఢ సానుభూతి తెలియజేవారి ఆత్మకు శాంతి చేకూర్చాలని దేవుని మనసారా కోడడం జరిగిందన్నారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి 2000 రూపాయలు 50 కేజీల రైస్ ఆర్థిక సాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి జిల్లా నాయకులు నోముల శ్రీనివాస్ మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు బట్టు విజయ్ మేకల రమేష్. ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు. దుర్గయ్య మాదిగ జిల్లెల్ల నాగరాజు. శ్రీనివాస్ మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## వినాయక ఊరేగింపులో డీజేలకు అనుమతి లేదు

## ఎస్సై పోచంపల్లి సతీష్




**చిట్యాల, సెప్టెంబర్ 20( జనం సాక్షి):** వినాయక చవితి ఉత్సవాల సందర్భంగా చిట్యాల మండలంలో నిర్వహించే వినాయక ఊరేగింపుల్లో డీజేలకు ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతి లేదని చిట్యాల పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ పోచంపల్లి సతీష్ తెలిపారు. డీజేల ద్వారా వచ్చే అధిక శబ్దం వల్ల వృద్ధులు, చిన్నపిల్లలు, అనారోగ్యంతో ఉన్నవారికి ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కావున నిర్వాహకులు డీజేలను ఏర్పాటు చేయకుండా పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ఎవరైనా నిబంధనలను ఉల్లంఘించి డీజేలను ఏర్పాటు చేసి వినియోగించినట్లయితే, వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్సై హెచ్చరించారు. వినాయక ఊరేగింపులను ప్రశాంతంగా, సురక్షితంగా నిర్వహిస్తూ పోలీసు శాఖకు సహకరించాలని చిట్యాల మండల ప్రజలకు, ఉత్సవ నిర్వాహకులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

## సైబర్ నేరాల పట్ల జాగ్రత్తగా ఉండండి : ఎస్సై జక్కుల పరమేశ్వర్



**శాయంపేట, సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** సైబర్ నేరాల పట్ల మండల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్ పరమేశ్వర్ తెలిపారు. శాయంపేట గ్రామానికి చెందిన కందగట్ల గోపాల్ అను వ్యక్తిని కొందరు సైబర్ నేరగాళ్లు ఫేస్ బుక్ లో ఫేక్ మ్యాట్రిమోనియల్ ముసుగులో మేము పోలీసులమని కాల్ చేసి నిన్ను డిజిటల్ అరెస్టు చేసినాము కొంత డబ్బులు పంపిస్తే నీ మీద కేసు లేకుండా చేస్తామని చెప్పి సదరు వ్యక్తి నుండి మొత్తం1,05,000 రూపాయలను సైబర్ నేరగాళ్లు కాజేసినారు అని తెలిపారు. కావున ప్రజలందరూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని శాయంపేట ఎస్సై పరమేశ్వర్ తెలిపారు .

# ఘనంగా పోతన జయంతి వేడుకలు



**పాలకుర్తి, సెప్టెంబరు 20 (జనంసాక్షి)** మండలంలోని బమ్మెరలో పోతన జయంతి ఉత్సవాలను పోతన సాహిత్య కళా వేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పోతన విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన తెలంగాణ చరిత్ర బృందం సభ్యుడు, అర్చకుడు కే.వీ.జీ.కే. ఆచార్య మాట్లాడారు. గ్రామంలో జన్మించిన ప్రతి విద్యార్థి నోట పోతన పద్యాలు జాలువారాలని అన్నారు. ఈ ప్రాంతంలో పోతన ఆనవాళ్లను సంరక్షించాల్సిన అవసరం గ్రామస్తులపై ఉందన్నారు. పోతన చరిత్రను నలు దిశలా చాటి చెప్పాలని సూచించారు. పోతన జన్మించిన గ్రామంలో పుట్టడం ఈ గ్రామస్తులు అందరు ధన్యులని అన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ బ్లాక్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, సౌదామిని సాహిత్య వ్యవస్థాపక అధ్యక్షుడు చింత ప్రసాద్, గ్రామ సర్పంచు జిట్టబోయిన రమ్య, ప్రశాంత్ యాదవ్. దేవ సాని ఉపేందర్, కొంగ సురేష్, భాస్కర్, పెంతల బిక్షం, సోమ సత్యం, మారం వెంకన్న, అంజమ్మ, నారాయణ, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

# చల్లా గోదాములలో ఘనంగా లక్ష్మీ గణపతి హోమం

**నెక్కొండ, సెప్టెంబర్ 20 ( జనం సాక్షి):** నెక్కొండ మండల కేంద్రంలోని గణపతి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నెక్కొండలోని చల్లా గోదాములలో ఉన్న స్వయంభూ గణపతి ఆలయ ప్రాంగణంలో ఆదివారం లక్ష్మీ గణపతి హోమం శాస్త్రోక్తంగా వైభవంగా నిర్వహించారు, మొదటగా స్వయం భూ గణపతికి వివిధ రకాల పండ్లు, మంగళ ద్రవ్యాలు, పంచామృతాలతో విశేష అభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామివారికి విభిన్న పదార్థాలను నైవేద్యంగా సమర్పించారు. మండపంలో లక్ష్మీ గణపతి హోమంతో పాటు రుద్ర సహిత గణపతి హోమాన్ని, పురుష సూక్త, శ్రీ సూక్త, మన్యు సూక్త, మరియు దేవి సూక్తములతో హవనాన్ని వేదోక్తంగా నిర్వహించారు. వరసిద్ధి వినాయక మండపంలో కూడా ప్రత్యేక పూజలు జరిపారు.ఆలయ అర్చకులు బివియన్ శాస్త్రి, వేద పండితులు పవిత్రన్ శర్మ,వేద జ్యోతిష పండితులు బూర్గుపల్లి శ్రవణ్ శాస్త్రి, వరప్రసాద్ శర్మలు ఈ పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. చల్లా గోదాముల యజమానులు లింగారెడ్డి - ఆండాలు దంపతులు, చల్లా శ్రీనివాసరెడ్డి - రమాదేవి , అరుణాదేవి దంపతులు, రమేష్ చందర్ రెడ్డి అపర్ణ దంపతులు, వారి కుటుంబ



సభ్యులు స్వయంగా పాల్గొని అభిషేక, పూజ, హోమ, అర్చన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో మేనేజర్ రమేష్ రెడ్డి, నెక్కొండ సర్పంచ్ పెండ్యాల హరిప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మన్ రావుల హరీష్ రెడ్డి, కుసుమ చెన్నకేశవులు, రఘోత్తం రెడ్డి, సుబ్బారెడ్డి, రవీందర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కొమ్ము రమేష్ యాదవ్, తాటిపల్లి శివకుమార్, దేవనబోయిన వీరభద్రయ్య , సుధా మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# భూపాలపల్లిని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు
- రూ.2 కోట్లతో అగ్నిమాపక భవనానికి శంకుస్థాపన.
- రూ.37 లక్షల సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ.



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** భూపాలపల్లి నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా వరుస అభివృద్ధి పనులకు శ్రీకారం చుడుతున్నట్లు భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు తెలిపారు. ఆదివారం భూపాలపల్లిలో పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు.

**రూ.2 కోట్లతో శాశ్వత అగ్నిమాపక భవనం:** జిల్లా ఏర్పడిన నాటి నుండి ఎదురుచూస్తున్న అగ్నిమాపక శాఖకు సొంత భవనం కల నెరవేరబోతోంది. భూపాలపల్లి మున్సిపాలిటీ 11వ వార్డు వేషాలపల్లి పరిధిలోని భాస్కర్ గడ్డలో రూ.2 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న అధునాతన అగ్నిమాపక శాఖ భవనానికి ఎమ్మెల్యే గండ్ర శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గతంలో అగ్నిమాపక కేంద్రం అద్దె భవనంలో ఉండటం వల్ల అనేక ఇబ్బందులు ఎదురయ్యేవని, ఎక్కడైనా అగ్ని ప్రమాదం జరిగితే వెంటనే స్పందించేందుకు వీలుగా జిల్లా కేంద్రంలో అన్ని హంగులతో పర్మినెంట్ భవనం అవసరమని గుర్తించి ప్రభుత్వంతో మాట్లాడి నిధులు మంజూరు చేయించామన్నారు. ఈ భవనంలో ఫైర్ స్టేషన్ తో పాటు సిబ్బందికి క్వార్టర్స్, వాహనాలకు షెడ్లు అన్ని అందుబాటులో ఉంటాయని, తద్వారా జిల్లా వ్యాప్తంగా ఎక్కడ ప్రమాదం జరిగినా నిమిషాల్లో చేరుకునే వీలుంటుందని తెలిపారు.

**27 మందికి రూ.37,64,600 సీఎంఆర్ఎఫ్ చెక్కులు:** అంతకుముందు తన క్యాంపు కార్యాలయంలో భూపాలపల్లి నియోజకవర్గానికి చెందిన 27 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) కింద మంజూరైన రూ.37,64,600 విలువైన చెక్కులను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. అనారోగ్యంతో బాధపడుతూ ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న ప్రతి ఒక్కరికి ప్రభుత్వం అండగా ఉంటుందని, కార్పొరేట్ ఆసుపత్రుల్లో వైద్యం చేయించుకున్న వారికి కూడా సీఎంఆర్ఎఫ్ ద్వారా ఆర్థిక సాయం అందిస్తున్నామన్నారు. ప్రజలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని సూచించారు.

**వినాయక మండపాల్లో సందడి:** అనంతరం వినాయక చవితి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు అన్న ప్రసాదం వడ్డించారు. అనంతరం పట్టణంలోని పలు వినాయక మండపాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్మన్ బుర్ర కొమురయ్య, టౌన్ కాంగ్రెస్ అధ్యక్షుడు దాట్ల శ్రీనివాస్, వైస్ చైర్మన్ అంబాల శ్రీనివాస్, మున్సిపల్ కౌన్సిలర్లు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, అగ్నిమాపక శాఖ అధికారులు పాల్గొన్నారు.

# నేటి నుండి 24 వరకు అంగన్‌వాడీ టీచర్ అభ్యర్థుల ధ్రువ పత్రాల పరిశీలన

- వెరిఫికేషన్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి.
- మహదేవపూర్ సీడీపీఓ ఆర్ రాధిక.
- అభ్యర్థులు దళారులను నమ్మి మోసపోవద్దు

**మహదేవపూర్ : సెప్టెంబర్ 20: (జనంసాక్షి):** మహదేవపూర్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ టీచర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన ప్రక్రియ నేటి నుండి ఈ నెల 24వ తేదీ వరకు నిర్వహించనున్నట్లు మహదేవపూర్ సీడీపీఓ ఆర్ రాధిక.ఒక్క ప్రకటనలో పేర్కొన్నారు. అభ్యర్థుల ధ్రువపత్రాల వెరిఫికేషన్‌కు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు పేర్కొన్నారు. అంగన్‌వాడీ టీచర్ నియామక ప్రక్రియ పూర్తిగా ప్రభుత్వ నిబంధనల ప్రకారమే జరుగుతుందని వారు స్పష్టం చేశారు. అభ్యర్థుల మెరిట్, రిజర్వేషన్ నిబంధనలను అనుసరించి మాత్రమే నియామకాలు చేపడతామని తెలిపారు.



దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ చెప్పే దళారులను నమ్మి మోసపోవద్దని సిడిపివో సూచించారు. ఆలాగేదళారులకు, కార్యాలయానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఉద్యోగం ఇప్పిస్తామని ఎవరైనా డబ్బులు డిమాండ్ చేసినా లేదా ప్రలోభాలకు గురిచేసినా నమ్మవద్దని తెలిపారు. నియామక ప్రక్రియ పారదర్శకంగా జరుగుతుందని, అర్హత కలిగిన అభ్యర్థులు నిర్ణీత తేదీల్లో అవసరమైన ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరై వెరిఫికేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని సీడీపీఓ ఆర్. రాధిక సూచించారు.

# ఆకలితో ఉన్నవారికి అన్నమే వినాయకుడి ప్రసాదం



**లక్షెట్టిపేట సెప్టెంబర్ 20 జనం సాక్షి** మండపం వద్ద కాకుండా నిరుపేదల చెంతకు అన్నదానం తీసుకెళ్లిన గాంధీనగర్ వినాయక భక్త మండలి. పండుగ అంటే పూజలు, ఉత్సవాలతో పాటు పేదల ఆకలి తీర్చడమే నిజమైన సేవ అని చాటిచెప్పారు లక్షెట్టిపేట గాంధీనగర్ వినాయక భక్త మండలి సభ్యులు. వినాయక నవరాత్రుల సందర్భంగా మండపం వద్ద అన్నదానం చేయడం కంటే.. నిజంగా ఆకలితో ఉన్న వారి చెంతకే అన్నప్రసాదాన్ని తీసుకెళ్లాలనే మానవీయ ఆలోచనతో ఆదివారం వినూత్న సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. లక్షెట్టిపేటలో ఆదివారం వారసంత కావడంతో పట్టణంలోని సంత మార్కెట్‌లో చిరు వ్యాపారులు, వికలాంగులు, నిరుపేదలు ఉదయం నుంచి తమ జీవనోపాధి కోసం శ్రమిస్తున్నారు. వారి పరిస్థితిని గమనించిన గాంధీనగర్ వినాయక భక్త మండలి సభ్యులు, మహిళలు కలిసి 300 వెజిటేబుల్ బిర్యానీ బాక్సులు, వాటర్ బాటిళ్లను సిద్ధం చేసి స్వయంగా వాహనంలో సంతకు తీసుకెళ్లారు. అక్కడ ఒక్కొక్క చిరు వ్యాపారి, నిరుపేద, వికలాంగుడి వద్దకు వెళ్లి ఆహారం, నీటిని అందించారు. ప్రతి సంవత్సరం వినాయక మండపాల వద్ద అన్నప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించడం ఆనవాయితీగా ఉన్నప్పటికీ.. ఈసారి ఆకలితో ఉన్నవారి చెంతకు వెళ్లి అన్నప్రసాదం అందించడం ద్వారా భక్తితో పాటు మానవత్వాన్ని చాటుకున్నారు. గత ఐదు సంవత్సరాల నుండి ఇదేవిధంగా నిరుపేదలకు అన్నప్రసాద బాక్సులను అందిస్తున్నామని గాంధీనగర్ వినాయక భక్త మండలి సభ్యులు పల్లెర్ల మనోహర్ దుర్గాప్రసాద్ లు తెలిపారు. తమకు ప్రత్యేకంగా ఎలాంటి ప్రచారం అవసరం లేదన్నట్లుగా స్వయంగా ఆహారాన్ని తీసుకెళ్లి పంపిణీ చేయడం పలువురి ప్రశంసలు అందుకుంది. 'మండపం వద్ద భోజనం పెట్టడం కంటే.. ఆకలితో ఉన్నవారి వద్దకు వెళ్లి అన్నం అందించడం ఎంతో సంతృప్తినిచ్చింది' అని మండలి సభ్యులు పేర్కొన్నారు. తమ వద్దకు వచ్చి ఆప్యాయంగా భోజనం, నీటిని అందించిన మండలి సభ్యులకు సంతలోని చిరు వ్యాపారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ వినాయక భక్త మండలి సభ్యులు పల్లెర్ల సురేష్, దుర్గాప్రసాద్, పల్లెర్ల మనోహర్,బొల్లం రామకృష్ణ, పల్లెర్ల శివకుమార్, కజ్జం రమేష్ బాబు, నల్మాస్ శ్రీనివాస్, గాదె శ్రీనివాస్, గోయికారి వాసు, బొద్దుకూరి రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# అధికారిక సమావేశాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించాలి

**శ్రీరాంపూర్ (జనంసాక్షి):** సింగరేణి యాజాన్యం నిర్వహించే అధికారిక సమావేశాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు ప్రధాన కార్యదర్శి తుమ్మల రాజారెడ్డి అన్నారు. ఏరియాలో నిర్వహించిన యూనియన్ సమావేశంలో మాట్లాడుతూ లేబర్ కమిషనర్ 2 సంవత్సరాల కాలపరిమితికి ఎన్నికలను నిర్వహించిన కాలపరిమితి ముగిసినందున యాజమాన్యం మైన్ స్థాయి,ఏరియా స్థాయి కంపెనీ స్థాయి,ప్రతి సమావేశాలకు అన్ని యూనియన్లను ఆహ్వానించి వారితో సంప్రదింపులు, సలహాలు, సూచనలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా యాజమాన్యం డీజీఎంఎస్ తో,ఏరియా స్థాయిలో నిర్వహించే బైపార్టీయేట్,ట్రై పార్టీయేట్ సమావేశాలకు గుర్తింపు, ప్రాతినిధ్య సంఘాలతో సంబంధం లేకుండా అన్ని యూనియన్లను ఆహ్వానించి సమావేశాలు జరపాలని లేదంటే అన్ని యూనియన్లము ఐక్యంగా కలిసి సమావేశాలలో ఆందోళనలు చేస్తామన్నారు. యాజమాన్యం డీజీఎంఎస్ అధికారులతో జరిపే సమావేశాల్లో కంపెనీలో జరిగిన పూర్తి ప్రమాదాల రిపోర్టులు, యంత్రాల సామర్థ్యము ఇతర వివరాలను కప్పిపుచ్చకుండా అసలు వివరాలు తెలియజేయాలన్నారు. యాజమాన్యం తన అనుకూల సంఘాన్ని దగ్గర పెట్టుకొని సేఫ్టీ బైపార్టీయేట్,ట్రై పార్టీయేట్ సమావేశాలు జరపడం వలన కార్మికులు పని ప్రదేశాల్లో తీవ్రమైన పనిముట్ల కొరతతో రక్షణ పరికరాల కొరత ఇబ్బందులు పడుతున్న యాజమాన్యం పట్టించుకోవడం లేదన్నారు.గత ఆర్థిక సంవత్సరం 5నెలలు గడిచిన ఇప్పటికి సంస్థ లాభాలు తెలియజేయకుండా ఉండడం సరైనది కాదని వెంటనే లాభాలను ప్రకటించాలని,మరోవైపు సీఎంపిఎఫ్ వివరాలు అప్ డేట్ చేయకుండా ఉండటంతో కార్మికులు సీఎంపిఎఫ్ విషయంలో గందరగోళానికి గురవుతున్నందున యాజమాన్యం వెంటనే స్పందించి పై సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ జనరల్ సెక్రటరీ అల్లి.రాజేందర్, శ్రీరాంపూర్ ఏరియా కన్వీనర్ రామగిరి రామస్వామి,కస్తూరి చంద్రశేఖర్,తోడే సుధాకర్,బోడకుంట శంకర్, వెంకట్ రెడ్డి,మెల్లం శ్రీధర్,మీడివెల్లి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఎంబీబీఎస్ సీట్లు సాధించిన విద్యార్థులకు ఘన సన్మానం

### స్మార్ట్ వాచ్‌లు బహుమతిగా అందజేసిన సామాజిక సేవకుడు



**గుడిహత్నూర్ సెప్టెంబర్ 20 ( జనం సాక్షి)** : ఇటీవల వెలువడిన నీట్ ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఎంబీబీఎస్ సీట్లు సాధించిన ఇచ్చోడ మండలానికి చెందిన విద్యార్థులను ఘనంగా సన్మానించారు. ఇచ్చోడ మండల కేంద్రానికి చెందిన సృష్టి మారుతీ ముండే, చించోలి గ్రామానికి చెందిన సృష్టి రాంచందర్ కేంద్రే, సేజల్ సంజీవ్ గిత్తే వైద్య విద్యకు ఎంపికయ్యారు.ఈ సందర్భంగా జల్దా గ్రామానికి చెందిన సామాజిక సేవకుడు, జై దేవి మెడికల్ అధినేత మదన్ వెంకట్ రావ్ గిత్తే విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు భవిష్యత్తులో మరింత ఉన్నత చదువులు అభ్యసించి, గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. విద్యార్థులను ప్రోత్సహించే ఉద్దేశంతో తన వంతుగా స్మార్ట్ వాచ్‌లను బహుమతిగా అందజేశారు. విద్యార్థుల విజయాన్ని అభినందిస్తూ వారి విద్యాభ్యాసానికి సమాజం నుంచి మరింత ప్రోత్సాహం అందించాలని పలువురు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వంజారి సంఘం పెద్దలు, ప్రముఖులు సుధామ్ గిత్తే, రాంచందర్ తిడ్కే, భానుదాస్ గిత్తే, డాక్టర్ బాలకృష్ణ, మౌళి, సురేష్, చక్రపాణి తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులు సాధించిన విజయంపై వారు హర్షం వ్యక్తం చేసి అభినందనలు తెలిపారు.

## అన్న ప్రసాదవితరణ సత్ కార్యక్రమం

అన్న వితరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డి ఎస్పి



**బయ్యారం సెప్టెంబర్ 20( జనంసాక్షి)** బయ్యారం గాంధీ సెంటర్‌లో గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో శనివారం అన్నదాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా డీఎస్పీ తిరుపతిరావు హాజరై అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ భక్తులకు అన్నప్రసాదం అందించడం అభినందనీయమని అన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా ఆధ్యాత్మికతతో పాటు సామాజిక సేవా భావం పెంపొందుతుందని తెలిపారు. గణేష్ ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, శాంతియుత వాతావరణంలో నిర్వహించాలని సూచించారు. అన్నదాన కార్యక్రమం చేపట్టిన ఉత్సవ కమిటీ సభ్యులను అభినందించారు. గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ఉత్సవాల్లో భాగంగా భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గార్ల బయ్యారం సి ఐ రవీందర్, ఎస్సై ప్రశాంత్ బాబు, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# మామునూరు ఎయిర్ పోర్టుకు రాణి రుద్రమ పేరు పెట్టాలి

## ప్రముఖ కవి శంకరమంచి శ్యాంప్రసాద్



**పాలకుర్తి, సెప్టెంబరు 20(జనంసాక్షి)** ఉమ్మడి వరంగల్ జిల్లాలోని మామునూరు విమానాశ్ర యానికి రాణి రుద్రమ పేరు పెట్టాలని పాలకుర్తికి చెందిన ప్రముఖ సాహితీవేత్త శంకరమంచి శ్యాంప్రసాద్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ మహిళా సాధికారతకు స్ఫూర్తినిచ్చేలా చారిత్రకంగా సాంస్కృతికంగా పేరుగాంచిన కాకతీయ వంశంలో జన్మించి క్రీ.శ 1262-1289 మధ్య కాలంలో శత్రుదుర్భేద్యంగా రాజ్యపాలన చేసిన తొలి మహిళా చక్రవర్తి రాణి రుద్రమదేవి అని అన్నారు. ఈ నేపథ్యంలో ఆమె ధైర్యసహసాలు, పోరాట పటిమ, రాజనీతిజ్ఞత నేటి తరానికి స్ఫూర్తిని అందించేలా దానికి రాణి రుద్రమ విమానా శ్రయంగా నామకణం చేస్తే సార్ధకంగా ఉంటుందని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దీనిని పరిగణలోకి తీసుకొని రాణి రుద్రమ పేరు పెట్టేలా ఆదిశలో ఆలోచన చేయాలని సూచించారు.

# బాధిత కుటుంబాలను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే





**శాయంపేట ,సెప్టెంబర్ 20 (జనం సాక్షి)** మాజీ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి శాయంపేట మండలం లోని బిఆర్ఎస్ పార్టీ నాయకులు అనారోగ్యంతో ఉన్న ధైనంపల్లి కరణ్ బాబు, ప్రమాదవశాత్తు కాలికి గాయమైన వార్డ్ మెంబర్ ధైనంపల్లి సుమన్ , ఆరెపల్లి గ్రామానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ మాజీ గ్రామ అధ్యక్షుడు అంబర్ కొండ రాజేశ్వరరావు సతీ మణి సుజాత అకాల మరణం చెందగా వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యం చెప్పారు. కార్యకర్తలకు ఏ కష్టం వచ్చినా ఎల్లవేళలా అందుబాటులో ఉంటానని మనోధైర్యం నింపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ శాయంపేట మాజీ గ్రామ అధ్యక్షుడు గాజె రాజేందర్, బిఆర్ఎస్ పార్టీ మండల మాజీ యూత్ అధ్యక్షుడు మార పల్లి మోహన్ ,బిఆర్ఎస్వి రాష్ట్ర నాయకులు కొమ్ముల శివ, ఆరెపల్లి గ్రామానికి చెందిన బి ఆర్ఎస్ పార్టీ నాయకులు మహేందర్, రాజు తదితరులు పాల్గొన్నారు.

# ఆట స్థలం ఉన్నా.. క్రీడా ప్రతిభకు దిక్కేది?

- పాఠశాలలో ఆటల పోటీలు నిర్వహణపై ప్రశ్నలు
- జిల్లా, రాష్ట్ర స్థాయిలో బహుమతులు సాధించని విద్యార్థులు

**దస్తూరాబాద్ , సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** పాఠశాలలో విశాలమైన ఆట స్థలం అందుబాటులో ఉన్నప్పటికీ విద్యార్థులకు క్రమం తప్పకుండా ఆటల పోటీలు, శిక్షణ కార్యక్రమాలు నిర్వహించకపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆటల్లో ప్రతిభను వెలికితీసి జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు విద్యార్థులను సిద్ధం చేయాల్సి ఉండగా, ఇక్కడి పరిస్థితి అందుకు భిన్నంగా ఉందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. పాఠశాలలో ఆట స్థలం ఉన్నప్పటికీ విద్యార్థులకు తగిన క్రీడా శిక్షణ, అంతర్గత పోటీలు, ఎంపిక కార్యక్రమాలు నిర్వహించకపోవడంతో విద్యార్థుల ప్రతిభ వెలుగులోకి రావడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఫలితంగా జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాల



విద్యార్థులు బహుమతులు సాధించలేని పరిస్థితి నెలకొందని అంటున్నారు. క్రీడల్లో ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి నిరంతర శిక్షణ అందించడంతో పాటు మండల, జిల్లా, రాష్ట్ర స్థాయి పోటీలకు పంపించాల్సిన బాధ్యత పాఠశాల యాజమాన్యం, సంబంధిత శారీరక విద్యా ఉపాధ్యాయులపై ఉంటుంది. అదే సమయంలో ఈ కార్యక్రమాలు సక్రమంగా జరుగుతున్నాయా లేదా అన్నదానిపై సంబంధిత విద్యాశాఖ అధికారులు పర్యవేక్షణ చేయాల్సిన అవసరం ఉంది.

**ఆట స్థలం ఉన్నా.. ఆటల్లో ప్రగతి ఎందుకు లేదు?**

విద్యార్థులకు పాఠశాల స్థాయిలోనే పోటీలు నిర్వహించకపోవడానికి కారణాలేమిటి? క్రీడా ప్రతిభను గుర్తించి జిల్లా, రాష్ట్ర స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నాలు ఎందుకు జరగడం లేదు? సంబంధిత అధికారులు పాఠశాలను పర్యవేక్షిస్తున్నారా? మండల విద్యాధికారి పర్యవేక్షణ లోపించిందా? అనే ప్రశ్నలు తల్లిదండ్రులు, విద్యార్థుల్లో వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖ ఉన్నతాధికారులు పాఠశాలలో క్రీడా కార్యకలాపాల నిర్వహణ, విద్యార్థులకు అందుతున్న శిక్షణ, క్రీడా సామగ్రి వినియోగం, గతంలో నిర్వహించిన పోటీల వివరాలపై సమగ్రంగా పరిశీలించి, ప్రతిభ ఉన్న విద్యార్థులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించాలని కోరుతున్నారు.



## వినాయకునికి ప్రత్యేక పూజలు

**టేకుమట్ల సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** టేకుమట్ల మండలం రామకృష్ణాపురం టి గ్రామంలో శ్రీ వినాయక చవితి నవరాత్రి ఉత్సవాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక వాతావరణంలో జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గరుడ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నెలకొల్పిన వినాయక మండపాన్ని మాజీ ఎంపిటిసి ఆది సునీత రఘు , మాజీ ఉపసర్పంచ్ నిమ్మల స్వామి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ చందర్ సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవాల నిర్వహణ కోసం వారు గరుడ యూత్ ప్రతినిధులకు రూ. 2,016/- (చందాను) అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విఘ్నేశ్వరుని కృపాకటాక్షాలు గ్రామంలోని ప్రజలందరిపై ఉండాలని, గరుడ యూత్ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఇలాగే ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆకాంక్షించారు. మండపాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆది సునీత రఘు , మాజీ ఉపసర్పంచ్ నిమ్మల స్వామి ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకులు రామ్ చందర్ లకు గరుడ యూత్ అసోసియేషన్ సభ్యులు హృదయపూర్వక ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు తదితరులుపాల్గొన్నారు




## రామాలయంలో అన్నదానం

**మహదేవపూర్, సెప్టెంబర్ 20 (జనంసాక్షి):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కేంద్రంలోని దుబ్బగూడెం రామాలయంలో గణేష్ నవరాత్రోత్సవల సందర్భంగా స్థానిక సర్పంచ్ హసీనా భాను అక్బర్ ఖాన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమానికి ముందుండి నడిపిస్తున్న విశ్వహిందుపరిషత్ కు చేందిన బిభీరి దేవారావు, సోనేపల్లి అంకిరేడ్డి కేశవరేడ్డి, ఆధ్వర్యంలో ఆర్థిక స్వాములు గణేశుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ హసీనా భాను. ఉపసర్పంచ్ శ్రీజ, వార్డు సభ్యులు రేడ్డి బాపురేడ్డి, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## అన్నప్రసాద వితరణలో నాయకులు

**పర్వతగిరి సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** పర్వతగిరి మండల కేంద్రం లో గుడిపంపు యూత్, ముదిరాజ్ యూత్, పద్మశాలి గణేశ యూత్, ల సభ్యులు నిర్వహించిన వినా యకుడి అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో భాగంగా వినాయకుళ్ళ ను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. మాజీ ఎంపీటీసీ మాడుగుల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన పలు అన్నప్రసాద వితరణ కార్యక్రమంలో పి ఎ సి ఎస్ ఛైర్మన్ మనోజ్ గౌడ్ మాజీ మండల పార్టీ అధ్యక్షుడు రంగు కుమార్ వార్డు సభ్యులు ఇస్లావత్ హరీశ్, కొప్పు రాజు, సీనియర్ నాయకులు రంగు కుమార్ (ఫర్టిలైజర్) గ్రామ పార్టీ అధ్యక్షుడు మెరుగు వెంకటేశ్వర్లు, చింతపట్ల సునీల్ రావు, మెచినేని రామారావు, మాడుగుల అఖిల్, పటేల్ శ్రీకాంత్, జూలపెల్లి రఘు, జనాగం శ్రవణ్, దుండి హరీశ్, నీరటి పవన్, నీరటి రంజిత్, నీరటి ప్రశాంత్, గుడెల్లి ప్రశాంత్, అడేపు పండు పాల్గొన్నారు





## గణేష్ మండపంలో వినూత్నంగా గోమాతకు పూజలు

**పాలకుర్తి. సెప్టెంబర్ 20 (జనంసాక్షి) :** గణపతి నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మండల కేంద్రంలోని సుప్రసిద్ధ పుణ్య క్షేత్రం సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆర్చి గేటు ఎదురుగా ఏర్పాటు చేసిన గణేష్ ని మండపం వద్ద మహిళ భక్తులు వినూత్నంగా గోమాతకు మంగళహారతులతో పూజలు నిర్వహించి. గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గణపయ్యకు నవరాత్రి పూజలతో పాటు గోమాతకు మంగళహారతిలో ప్రత్యేక పూజలు నిర్వహించడం ప్రత్యేక ఆకర్షణగా నిలవడంతో భక్తులు అశేషంగా తరలివచ్చి గణపయ్యను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమాన్ని కనులారా చూసేందుకు భక్తులు అశేషంగా తరలివచ్చి గణపయ్యకు మొక్కులు చెల్లించుకున్నారు.

# నిమజ్జన వేడుకలకు పిల్లలను దూరంగా ఉంచాలి

**వెంకటాపూర్ ఎస్ఐ చల్లా రాజు**



**వెంకటాపూర్ (రామప్ప ), సెప్టెంబర్ 20(జనం సాక్షి ):** గణేష్ నిమజ్జన వేడుకలకు పిల్లలను దూరంగా ఉంచాలని వెంకటాపూర్ ఎస్.ఐ చల్ల రాజు తల్లిదండ్రులకు సూచించారు. ములుగు మండలం కాసిందేవిపేట గ్రామంలో ఆదివారం సాయంత్రం ఇద్దరు చిన్నారులు నీటి గుంటలో పడి మృతి చెందిన సంఘటన నేపథ్యంలో ఆయన వెంకటాపూర్ మండల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇటీవల కురుస్తున్న వర్షాలతో చెరువులు, కుంటలు, గుంటలు నీటితో నిండి ప్రమాదకరంగా మారాయని తెలిపారు. పిల్లలు ఆటల కోసం, ఈత కోసం అలాంటి ప్రాంతాలకు వెళ్లడం చాలా ప్రమాదకరమని అన్నారు. పిల్లలు ఎక్కడికి వెళు_న్నారో తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని,ఒంటరిగా చెరువులు, కుంటల వద్దకు వెళ్లకుండా చూడాలని పేర్కొన్నారు. నిమజ్జనాలు జరుగుతున్న నేపథ్యంలో పిల్లలను, యువకులను చెరువుల వద్దకు తీసుకెళ్లవద్దని,నీటి లోతు తెలియక ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందని అన్నారు.వ్యవసాయ పొలాల్లో తవ్విన నీటి గుంతలు, ఇసుక గుంతల వద్దకు పిల్లలను వెళ్లనీయవద్దని,పై నుంచి సాధారణంగా కనిపించినా లోపల లోతు ఎక్కువగా ఉంటుందని సూచించారు. పిల్లల భద్రత విషయంలో నిర్లక్ష్యం వద్దని, ప్రతి తల్లిదండ్రి తమ పిల్లలను కంటికి రెప్పలా కాపాడుకోవాలని, ఇలాంటి విషాద ఘటనలు పునరావృతం కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎస్.ఐ చల్ల రాజు పేర్కొన్నారు.

## తెలంగాణ వచ్చినా ఉద్యమకారులకు దక్కని న్యాయం



**హనుమకొండ (జనంసాక్షి) :** తెలంగాణ రాష్ట్రం ఏర్పడి ఏళ్లు గడుస్తున్నా.. రాష్ట్ర సాధన కోసం పోరాడిన ఉద్యమ కారులకు మాత్రం న్యాయం జరగలేదని తెలంగాణ ఉద్యమ కారుల ఐక్యవేదిక రాష్ట్ర చైర్మన్, ప్రముఖ న్యాయవాది గుడిమల్ల రవికుమార్ అన్నారు. హనుమకొండ కాకతీయ కాలనీలోని ఐక్యవేదిక కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 17వ తేదీ నుంచి వరంగల్‌లోని తొలి దశ ఉద్యమకారుల జెండా వేదిక నుంచి ఉద్యమకారుల ఓదార్పు యాత్రను ప్రారంభించినట్లు తెలిపారు. ప్రతిరోజూ 25 మంది ఉద్యమకారుల కుటుంబాలను కలిసి వారి స్థితిగతులను తెలుసుకుంటున్నామని, ఇప్పటివరకు 75 కుటుంబాలను పరామర్శించినట్లు చెప్పారు. ఉద్యమకారుల కుటుంబాల దయనీయ పరిస్థితులను చూస్తుంటే కన్నీళ్లు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన ఉద్యమకారులకు రాష్ట్రం ఏర్పడిన తర్వాత సంక్షేమ పథకాల ఫలాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల్లో ఉద్యమకారులకు కనీస ప్రయోజనం కూడా దక్కడం లేదని ఆరోపించారు. చివరకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు కూడా ఉద్యమకారులకు అందలేదని అన్నారు. ఉద్యమకారులను విస్మరించడం దుర్మార్గమని, వారి పట్ల ప్రభుత్వాల వైఖరి బాధాకరంగా ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రం ఉద్యమకారుల త్యాగాల ఫలితమని, వారి త్యాగాల పునాదులపై ఏర్పడిన రాష్ట్రంలో సంక్షేమ పథకాల్లో వారికి తగిన ప్రాధాన్యం కల్పించాలని డిమాండ్ చేశారు. అమరులైన ఉద్యమకారుల కుటుంబాలను గుర్తించి వారికి సంక్షేమ పథకాలు అమలు చేయాలని కోరారు. అనేక మంది ఉద్యమకారులు నేటికీ పేదరికంలో మగ్గుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల ఆత్మగౌరవం, అస్తిత్వం కోసమే ఓదార్పు యాత్ర చేపట్టామని, ఇది ఏ రాజకీయ పార్టీకి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. ఓదార్పు యాత్ర ముగిసేలోగా ప్రతి ఉద్యమకారుడికి సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు.